తెలుగు దినపత్రిక
RNI TG TEL/ 26/A0381
# సిరి
People's Voice
వార్త పత్రిక
03-04-2026
శుక్రవారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 66
PUBLISHED FROM HYDERABAD
పేజీలు-8 వెల:రూ.4 /–



## ఆర్టీసియన్ల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి!!

- ఐఎన్టియూసి 327 రాష్ట్ర కార్యదర్శి ఇనుగల శ్రీధర్ 5




# అమిత్ షా టార్గెట్ మిస్సయ్యిందా?

లేక ఆపరేషన్ పూర్తయ్యిందా?
కగార్ కు చిక్కని గణపతి
గడువు దాటినా జాడ లేని దళపతి

హైదరాబాద్, ఏప్రిల్ 2, సిరి న్యూస్‌టుడే:

కేంద్ర బీజేపీ సర్కార్ చేపట్టిన కగార్ ఆపరేషన్ ద్వారా మావోయిస్టు పార్టీపై గట్టి దెబ్బ పడినా, ఆ పార్టీ కీలక సిద్ధాంతకర్త గణపతిని పట్టుకోవడంలో విఫలమైంది. మార్చి 31 నాటికి లక్ష్యాన్ని చేరుకోవాలని భావించిన కేంద్రం, భారీ స్థాయిలో మిలిటరీని వినియోగించినప్పటికీ ప్రధాన లక్ష్యాన్ని సాధించలేక పోయింది. దేశవ్యాప్తంగా వచ్చిన విమర్శలను కేంద్ర హోంమంత్రి అమిత్ షా

మిగతా 2వ పేజీలో..



## కేబినెట్ విస్తరణపై ఉత్కంఠ..
# ఉండేదెవరో..ఊడెదెవరో..?

- మంత్రివర్గ విస్తరణలో ఇద్దరికే ఛాన్స్
- ఆశల పల్లకిలో పలువురు నేతలు
- పలువురు మంత్రుల్లో గుబులు
- అయిదు రాష్ట్రాల ఎన్నికల అనంతరం విస్తరణ
- సామాజిక న్యాయంపై ఇప్పటికే కసరత్తు 3





## కాళేశ్వరం పేరుతో
# ప్రజాధనం లూటీ

### కేసీఆర్ ఇష్టానుసారం కాళేశ్వరం నిర్మాణం

ఏటీఎంలా ప్రాజెక్టును వాడుకున్నారు
ఐదు మండలాలపై నాడు నోరు మెదపలేదు
అవినీతిపై కేసీఆర్‌ను జైలుకు పంపుతామన్న కాంగ్రెస్
రాజ్యసభలో సురేష్ రెడ్డి వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం 3





## చికెన్ సెంటర్ల బంద్‌తో దిగివచ్చిన పౌల్ట్రీలు

- డిమాండ్లు అంగీకరించినట్లు ట్రేడర్స్ వెల్లడి 3



## పర్సెంటేజీల ప్రకారమే సినిమాల ప్రదర్శన

- నేటి నుంచే ఈ విధానం అమలు
- 23 సింగిల్ స్క్రీన్ థియేటర్ యాజమాన్యాల ప్రకటన 3

## తెలంగాణ ఆత్మగౌరవాన్ని
# కించపరుస్తారా?

- ఆ మండలాలను అప్పగించిన పాపం బీజేపీదే
- కాళేశ్వరంపై రేవంత్ దుష్ప్రచారాన్నే వల్లెవేశారు
- నాడు ప్రశంసలు.. నేడు రాజకీయ లబ్ధి కోసం అబద్ధాలు 3
- ఈ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తూనే గొంతు కోస్తారా
- రాజ్యసభలో కిషన్‌రెడ్డి వ్యాఖ్యలపై హరీశ్‌రావు ధ్వజం



## కాంగ్రెస్ మోసాలను ఎండగట్టాలి 3



## గ్యారంటీలపై సందేహాలా..
# తెలంగాణకు రండి

- అవినీతి, కుటుంబ పాలనలో ఒకేలా కేసీఆర్, విజయన్
- కేంద్ర నిధులు మోదీ కరుణ కాదు.. ప్రజల హక్కు
- యూడీఎఫ్ మేనిఫెస్టో విడుదలలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి 2

## రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు

- సభల్లో సీఎం రేవంత్ సందేశం విడుదల



2



## చేనేత ఆర్డర్ల రద్దుతో కార్మికులపై కక్ష

- అయిన వారి కోసం.. కార్మికుల పొట్ట కొడతారా?
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డ కవిత 2



## పరిశోధన, విస్తరణల్లో సంయుక్త భాగస్వామ్యం

ప్రత్యేక పంటలు, ప్రాసెసింగ్ పరిశ్రమలపై చర్చ
మంత్రి తుమ్మలతో యూఎఫ్ ప్రతినిధుల సమావేశం 2


## సైబర్ నేరాల కేసు
# మరో కీలక మలుపు

### మరో ముగ్గురు బ్యాంక్ ఉద్యోగుల అరెస్ట్

ఖమ్మం, ఏప్రిల్ 2, సిరి న్యూస్‌టుడే:

సత్తుపల్లి సైబర్ నేరాల కేసు మరో కీలక మలుపు తిరిగింది. ఈ కేసుకు సంబంధించి మరో ముగ్గురు బ్యాంక్ ఉద్యోగులను పోలీసులు అరెస్టు చేశారు. సైబర్ క్రై కేసులో సీఆర్‌వోలు

మిగతా 2వ పేజీలో..



# సమస్యల ధరణిని బంగాళాఖాతంలో వేశాం

అసెంబ్లీ సమావేశాల్లో ఉగ్రవాదుల్లా ప్రతిపక్ష నాయకులు 2
ప్రజా ప్రభుత్వానికి మీ దీవెనలు కావాలి
వితాయిపల్లిలో 'భూభారతి' ప్రారంభించిన మంత్రి పొంగులేటి



## నెలాఖరుకు రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు 2

## సలేశ్వరం జాతరకు పోటెత్తిన జనం..

అటవీ అధికారుల ఆంక్షల నడుమ సాగుతున్న సహతోపేత యాత్ర..! 5



## నెలాఖరుకు రెండో
# విడత ఇందిరమ్మ ఇళ్లు

- పారదర్శకంగా లబ్దిదారుల ఎంపిక
- మంత్రి పొంగులేటి స్పష్టీకరణ

**రంగారెడ్డి, ఏప్రిల్ 2, సిరి న్యూస్‌టుడే:**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ ఇళ్ల' పథకం రెండో విడతకు సంబంధించి కీలక ప్రకటన వెలువడింది. రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మండలం మితాయిపల్లి పర్యటనలో రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ పథకంపై స్పష్టతనిచ్చారు. ఈ నెలాఖరులోగా రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను ప్రారంభిస్తామని ఆయన ప్రకటించారు. ఇప్పటికే మొదటి విడతలో భాగంగా నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున కేటాయించారు. చాలా వరకు ఇళ్ల నిర్మాణాలు కూడా పూర్తి కావచ్చాయి. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు అందే వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని.. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్దిదారులకే మేలు చేకూర్చడమే ప్రజా ప్రభుత్వం ధ్యేయమని మంత్రి స్పష్టం చేశారు. ఏప్రిల్ నెలాఖరులోగా రెండో విడతకు సంబంధించిన మార్గదర్శకాలు, ఎంపిక జాబితాపై అధికారులు కసరత్తు పూర్తి చేయనున్నారు. తమ ప్రభుత్వం కేవలం మాటలకే పరిమితం కాకుండా, కోటి మంది మహిళలను 'కోటీశ్వరులుగా' తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తోందని మంత్రి తెలిపారు. భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం 'ఇంటిగ్రేటెడ్ భూభారతి' పోర్టల్‌ను ఆవిష్కరించిన ఆయన.. ఇది ప్రజలకు భూమికి సంబంధించిన అన్ని హక్కులను భద్రపరుస్తుందని వివరించారు. భూమి రికార్డుల్లో పారదర్శకత తీసుకురావడమే ఈ పోర్టల్ ప్రధాన ఉద్దేశం



## గ్యారంటీలపై సందేహాలా..
# తెలంగాణకు రండి

- అవినీతి, కుటుంబ పాలనలో ఒకేలా కేసీఆర్, విజయన్
- కేంద్ర నిధులు మోదీ కరుణ కాదు.. ప్రజల హక్కు
- యూడీఎఫ్ మేనిఫెస్టో విడుదలలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

**కొచ్చి, ఏప్రిల్ 2 సిరి న్యూస్‌టుడే :**

యూడీఎఫ్ ప్రకటించిన గ్యారంటీలపై విమర్శలు చేస్తున్నవారు అవి ఎలా అమలవుతాయో తెలుసుకోవాలంటే తెలంగాణకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. కాంగ్రెస్ పాలనలో అమలవుతున్న పథకాలను ప్రత్యక్షంగా పరిశీలిస్తే ట్రాక్ రికార్డు అర్థమవుతుందని తెలిపారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, ఆయన మంత్రులు తెలంగాణకు వస్తే గ్యారంటీల అమలు ఎలా జరుగుతోందో చూపిస్తామని చెప్పారు. కొచ్చిలో యూడీఎఫ్ మేనిఫెస్టో విడుదల సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కేరళలో విజయన్ పాలన ముగిసిందని, యూడీఎఫ్ స్వర్ణయుగం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

**పినరయి–కేసీఆర్ పాలనలపై విమర్శలు**

విజయన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై సీఎం తీవ్ర విమర్శలు గుప్పించారు. దేశాన్ని, కేరళను "మోదీ బ్రదర్స్" పాలిస్తున్నారని వ్యాఖ్యానించారు. శబరిమల ఘటనను ప్రస్తావిస్తూ దేవుడి సొంత రాష్ట్రంలో దేవుడి ఆస్తికీ రక్షణ లేదని అన్నారు. కుటుంబ పాలన, అవినీతి, అసమర్థత విషయంలో పినరయి విజయన్, కేసీఆర్ పాలనల్లో పోలికలున్నాయని విమర్శించారు. తెలంగాణలో వచ్చిన మార్పు తరహాలో కేరళలోనూ ప్రజలు మార్పు తీసుకొస్తారని ధీమా వ్యక్తం చేశారు. విమర్శించడం తన స్వభావమని, రాజకీయంగా ప్రత్యర్థులను ప్రశ్నించడం కొనసాగిస్తానని స్పష్టం చేశారు.

**హామీల అమలులో తెలంగాణ మోడల్**

కేరళలో యూడీఎఫ్ గ్యారంటీలు అమలు సాధ్యమా అన్న సందేహాలకు సమాధానం తెలంగాణేనని సీఎం పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే తొలి కేబినెట్ సమావేశం నుంచే హామీల అమలు ప్రారంభించామని తెలిపారు. 25 లక్షల రైతు కుటుంబాలకు రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశామని, ఎకరాకు రూ.12 వేల చొప్పున రైతు భరోసా అందిస్తున్నామని చెప్పారు. 67,173 ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని, ఎంపికైన వారికి ప్రజల సమక్షంలో నియామక పత్రాలు అందజేశామని వివరించారు.

**మహిళలకు ప్రాధాన్యం, సంక్షేమ పథకాల అమలు**

మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించి ఆర్టీసీని నష్టాల నుంచి లాభాల్లోకి తీసుకొచ్చామని తెలిపారు. ఉచిత ప్రయాణంతో మహిళలకు నెలకు రూ.6-7 వేల వరకు ఆదా అవుతోందని చెప్పారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్ల మంజూరు వంటి పథకాలు అమలు చేస్తున్నామని వెల్లడించారు. మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దే చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

**ఆర్థిక లక్ష్యాలు, కేంద్ర నిధులపై వ్యాఖ్యలు**

తెలంగాణ రైజింగ్ విజన్ 2047 ప్రకారం 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతామని సీఎం చెప్పారు. రాష్ట్ర వృద్ధి రేటు 10.8 శాతంగా ఉందని, పన్నులు పెంచకుండానే అభివృద్ధి సాధ్యమని నిరూపించామని తెలిపారు. కేంద్ర నిధులు ప్రధాని కరుణ కాదని, రాష్ట్ర హక్కు అని ప్రజలకు తెలియజేస్తామని స్పష్టం చేశారు.


**కేరళలో 'ఇందిరా ఐదు గ్యారంటీలు' ప్రకటన**

కేరళలో యూడీఎఫ్ మహిళలకు కేఎస్ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, కాలేజీ విద్యార్థినులకు నెలకు రూ.1,000 సహాయం, పింఛన్లను రూ.3 వేలకు పెంపు, ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల ఆరోగ్య బీమా, యువతకు రూ.5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు వంటి ఐదు గ్యారంటీలు ప్రకటించింది. వీటితో పాటు సముద్ర, విమానయాన రంగాల్లో డ్రీమ్ ప్రాజెక్టులు, వయనాడ్‌లో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు వాగ్దానాలు ఉన్నాయి.

# సమస్యల 'ధరణి'ని బంగాళాఖాతంలో వేశాం

- అసెంబ్లీ సమావేశాల్లో ఉగ్రవాదుల్లా ప్రతిపక్ష నాయకులు
- ప్రజా ప్రభుత్వానికి మీ దీవెనలు కావాలి
- విఠాయిపల్లిలో 'భూభారతి' ప్రారంభించిన మంత్రి పొంగులేటి

**ఆమనగల్లు, ఏప్రిల్ 2, సిరి న్యూస్‌టుడే :**



పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు పరిష్కరించని 'ధరణి'ని బంగాళాఖాతంలో పడేశామని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు రెవెన్యూ శాఖలో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టినట్లు రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీలోని విఠాయిపల్లి గ్రామంలో సమీకృత భూభారతి పోర్టల్, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా గురువారం నిర్వహించిన గ్రామ సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పొంగులేటి భూ క్రయవిక్రయాల్లో అక్రమాలకు చెక్ పెట్టేందుకు రూపొందించిన 'సమీకృత భూభారతి' పోర్టల్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ భవిష్యత్తు ప్రణాళిక ఆధారంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నిటీ ప్రణాళికాబద్ధంగా ప్రతి అంశాన్ని క్షుణంగా పరిశీలించి అమలు చేస్తున్నామని చెప్పారు. 5,270 గ్రామాలలో వీఆర్వోలను ఏర్పాటు చేశామని, అదేవిధంగా లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ఆరు నెలలు శిక్షణ అందించి నియమించామని గుర్తు చేశారు. రైతులకు పారదర్శకంగా సులభతరమైన సేవలు అందించడానికి ల్యాండ్ సర్వే రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను రూపొందించామన్నారు. ఈ పోర్టల్‌ను గురువారం నుంచి ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభించి భూ వివాదాల పరిష్కారానికి తొలి అడుగు వేస్తున్నట్లు వెల్లడించారు. వచ్చే ఫలితాలన"బట్టి అవసరమైన మార్పులు చేర్పులు చేసి ముందుకెళ్లాలని నిర్ణయించామన్నారు. రాష్ట్రంలో మొదటగా ఖమ్మం జిల్లా కూసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట, రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు, సంగారెడ్డి జిల్లా వట్టిపల్లి, నారాయణపేట జిల్లా కోస్గి మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నామని, ఆయా జిల్లాల కలెక్టర్లు పోర్టల్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్ష నాయకులు ఉగ్రవాదులుగా వ్యవహరించారంటూ ప్రజా సమస్యలను పక్కనపెట్టి రాజకీయాలు చేయడం భావ్యం కాదన్నారు. అసెంబ్లీలో జరిగిన సంఘటన వారి విజ్ఞతకే వదిలేస్తున్నామంటూ ఇప్పటికైనా జ్ఞానోదయం కలిగి ప్రవర్తించాలని మంత్రి సూచించారు. గతంలో మాదిరిగా రైతులు తమ భూ సేవల కోసం మీసేవ కేంద్రాలకు వెళ్లాల్సిన పని లేకుండా ఇంటి నుంచే పొందేలా ఫొటోలు తయారు చేశామన్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో కుప్పగండ్ల చెదురువెల్లిలో భూ సమస్యల పరిష్కారాన్ని కృషిచేయాలన్నారు. అదే విధంగా ఆమనగల్‌లో డంపింగ్ యార్డు తదితర సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. రెండో విడతలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్, రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పత్యా, కౌన్సిలర్ అనిత, మార్కెట్ కమిటీ చైర్మన్ గీతా నరసింహ, టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, కండె సాయి, తహసిల్దార్ ఫహీం ఖాద్రి, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

# అమిత్ షా టార్గెట్ మిస్సయ్యిందా?

**మొదటిపేజీ తరువాయి**



పట్టించుకోలేదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

గత సంవత్సరం ఆగస్టు 10న జరిగిన పొలిట్‌బ్యూరో సమావేశానికి గణపతి హాజరయ్యారని, ఆ తర్వాత ఆయన పార్టీతో సంబంధాలు తెంచుకున్నారంటూ సీనియర్ మావోయిస్టులు వెల్లడించారు. ఆగస్టు తర్వాత ఆయన భారత్‌లో ఉన్నారా లేక విదేశాలకు వెళ్లిపోయారా అన్నది స్పష్టత లేకుండా మారింది. నేపాల్‌లో కూడా మావోయిస్టులకు మద్దతు ఉండటంతో, బీహార్, జార్ఖండ్ నెట్‌వర్క్ సహాయంతో ఆయన అక్కడికి వెళ్లి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఉమ్మడి కరీంనగర్ జిల్లా జగిత్యాల బీర్పూర్‌కు చెందిన లక్ష్మణరావు అలియాస్ గణపతి, ఎమర్జెన్సీ అనంతరం 1976 నుంచే అజ్ఞాత జీవితం ప్రారంభించారు. 1980 తర్వాత పూర్తిగా భూగర్భ కార్యకలాపాల్లోనే కొనసాగుతూ, పీపుల్స్ వార్ పార్టీకి కీలక నేతగా ఎదిగారు. కేంద్ర కార్యదర్శి జనరల్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా ఆయన ప్రజల్లో చాలా అరుదుగా మాత్రమే కనిపించారు.

మావోయిస్టులపై కేంద్రం చేపట్టిన ఆపరేషన్లలో వెయ్యికి పైగా నక్సలైట్లు మృతి చెందగా, 12 మంది కేంద్ర కమిటీ సభ్యులు ఎన్‌కౌంటర్లలో హతమయ్యారు. మరో ఎనిమిది మంది లొంగిపోయారు. బసవరాజ్ మృతి తర్వాత పార్టీ గందరగోళంలో పడింది. ప్రస్తుతం గణపతి సహా కొద్ది మంది కీలక నేతలు మాత్రమే అజ్ఞాతంలో ఉన్నట్లు అమిత్ షా పార్లమెంటులో తెలిపారు. ఒకప్పుడు 13 రాష్ట్రాలకు విస్తరించిన మావోయిస్టు ప్రభావం ఇప్పుడు నాలుగు, ఐదు జిల్లాలకు పరిమితమైంది. అయినప్పటికీ గణపతి లాంటి కీలక నేతను పట్టుకోలేకపోవడం నిఘా వ్యవస్థల వైఫల్యంగా భావిస్తున్నారు. లొంగిపోయిన మావోయిస్టులు కూడా గణపతి గురించి సమాచారం ఇవ్వకపోవడం విచారణను మరింత క్లిష్టం చేస్తోంది.

మరోవైపు, గణపతి లొంగుబాటు కోసం ఆయన తనయుడు శ్రీనివాస్ విడుదల చేసిన వాయిస్ రికార్డు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. "నాన్న మీరు రావాలి, మిమ్మల్ని చూడాలని ఉంది" అంటూ చేసిన విజ్ఞప్తి భావోద్వేగాన్ని రేకెత్తించింది. గణపతి ఎక్కడ ఉన్నారు, ఎప్పుడు బయటకు వస్తారు అన్నదానిపై ఆసక్తి దేశవ్యాప్తంగా కొనసాగుతోంది.


# రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు

- సభల్లో సిఎం రేవంత్ సందేశం విడుదల

**హైదరాబాద్, ఏప్రిల్ 2, సిరి న్యూస్‌టుడే:**



ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా రాష్ట్రమంతటా గ్రామ సభలు జరుగుతున్నాయి . సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు సందేశం అందించారు. గ్రామ సభల్లో అధికారులు ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపిస్తారు. ప్రజా ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించి రెండు సంవత్సరాల మూడునెలలు పూర్తయ్యింది. ఆర్థిక సవాళ్లను అధిగమిస్తూ, గత పాలకుల తప్పిదాలను సరిచేస్తూ... సంక్షేమం, అభివృద్ధి విషయంలో రాజీపడకుండా మన ప్రభుత్వం పని చేస్తోంది. మేం పాలకులం కాదు.. సేవకులం అన్న భావనతో ప్రజల ఆకాంక్షలు, అవసరాలే కేంద్ర బిందువుగా నిత్యం శ్రమిస్తున్నాం. ప్రతి నిర్ణయంలో ప్రజల మేలు, సామాజిక బాధ్యత, రాష్ట్ర భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుంటున్నాం.ఉప ఎన్నికలు, పంచాయతీ ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల్లో వరుస విజయాలతో ప్రజా పాలనకు మీ ఆమోదం, మద్దతు ప్రకటించారు. మీరు ఇచ్చిన ఈ ఫలితాలు మా బాధ్యతను మరింత పెంచాయి. ప్రభుత్వ పథకాలు అంటే కాగితాల పై కాదు... ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పు తేవాలన్నది మా సంకల్పం. ఆ ఉద్దేశంతోనే 'ప్రజాపాలన ప్రగతిప్రణాళిక' పేరుతో కార్యక్రమాన్ని ప్రారంభించాం. మార్చి 6 నుండి 99 రోజుల పాటు, గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు, అన్ని శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమం ఒక ఉద్యమంలా సాగాలి. ఊరువాడ సమస్యల పరిష్కారమే పరమావధిగా ప్రతి అధికారి పని చేయాలి. వేగంగా ఫైళ్ల క్లియరెన్స్, ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రత, నిర్ణయాల్లో పారదర్శకత ఉండాలి. మహాలక్ష్మి... ఉచిత బస్సుసౌకర్యం, 500 కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్ళు, మహిళా సాధికారత వంటి పథకాలు అర్హులకు చేరేలా ఈ కార్యక్రమం జరగాలి. తెలంగాణ రైజింగ్ 2047' విజన్ తో ఆర్థికంగానే కాక, అన్నీ రంగాల్లో తెలంగాణను ప్రపంచంలో నెంబర్ వన్ గా నిలపాలన్నది మన సంకల్పం. ఈ సంకల్పంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి. క్యూర్,ప్యూర్, రేర్‌గా రాష్ట్రాన్ని వర్గీకరించుకున్నాం. వాటి పరిధిలో సేవా, తయారీ, వ్యవసాయ రంగాల్లో ప్రపంచానికి ఆదర్శంగా మనం ఎదగాలి. 99 రోజుల కార్యాచరణ ఒక సాధారణ కార్యక్రమం కాదు.. ఒక దీక్ష. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు ఒక్కటై... దేశానికి, ప్రపంచానికి ఆదర్శంగా ఎదగాలి. ఇదే నా కల. ఆ కలను సాకారం చేయడంలో ప్రతి తెలంగాణ బిడ్డ భాగస్వామి కావాలి. మీ అందరి సహకారాన్ని కోరుకుంటూ మీ రేవంత్ రెడ్డి అన్న సందేశాన్ని విడుదల చేశారు



## సైబర్ నేరాల కేసు మరో కీలక మలుపు

**మొదటిపేజీ తరువాయి**

ఓర్సు కృప, మంద శ్రీహరిబాబు, బీఆర్‌వో జుంజునూరి రాధాకృష్ణను సత్తుపల్లి సీఐ శ్రీహరి అరెస్టు చేశారు. ఈ కేసులో ఉడతనేని వికాస్ చౌదరి, బొప్పన నాగప్రియ, చంద్రుగొండకు చెందిన బ్యాంక్ మేనేజర్ అఖిల్ అబ్దుల్ ఇప్పటికే అరెస్టయిన సంగతి తెలిసిందే. అయితే, విచారణ సందర్భంగా తాజాగా అరెస్టయిన ముగ్గురు నిందితులు వారికి సహకరించినట్లు తేలింది. ఈ మేరకు ఓర్సు కృప, మంద శ్రీహరి బాబు, బీఆర్‌వో జుంజునూరి రాధాకృష్ణను సీఐ శ్రీహరి అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ వసుంధర యాదవ్ తెలిపారు. కాగా, రూ.549.95 కోట్లు దోచుకున్న కేసులో వీరిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితులంతా అంతర్జాతీయ సైబర్ నేరస్థులతో చేతులు కలిపినట్లు విచారణలో పోలీసులు గుర్తించారు. షేర్ మార్కెట్లలో పెట్టుబడులు, బెట్టింగ్, మ్యాట్రిమోనీ, రివార్డు పాయింట్లు, గేమింగ్, క్రిప•టో కరెన్సీ వంటి మోసాలకు నిందితులు పాల్పడినట్లు పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి 24 మందిపై కేసు నమోదు కాగా ఇప్పటికే చాలా మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు పోలీసులు.

## చేనేత ఆర్డర్ల రద్దుతో కార్మికులపై కక్ష

**మొదటిపేజీ తరువాయి**

ఆర్డర్ ఇచ్చేవారని.. ఇప్పుడు దాని రద్దుతో వేలాది మందికి ఉపాధి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేతల ఉపాధి సంక్షోభంలో పడిందని కవిత ధ్వజమెత్తారు. ఈ నిర్ణయం రాష్ట్రంలోని 393 చేనేత సహకార సంఘాలపై తీవ్ర ప్రభావం చూపనుందని.. కార్మికులు వీధిన పడే దుస్థితి వచ్చిందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ శాఖలకు చెందిన దుప్పట్లు, దుస్తులకు సంబంధించి రూ.200 కోట్ల ఆర్డర్లను కూడా తెలంగాణ చేనేతలకు ఇవ్వలేదని ఆరోపణలు గుప్పించారు.గ •స్కోకు ఆర్డర్లు ఇవ్వకుండా సంస్థను నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రైవేట్ వ్యక్తులకు లాభం చేకూర్చేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని రేవంత్ సర్కార్‌పై విమర్శలు గుప్పించారు కవిత. ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే కార్మికులతో కలిసి పెద్దఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు కల్వకుంట్ల కవిత.



# పరిశోధన, విస్తరణల్లో సంయుక్త భాగస్వామ్యం


- ప్రత్యేక పంటలు, ప్రాసెసింగ్ పరిశ్రమలపై చర్చ
- మంత్రి తమ్మలతో యూఎఫ్ ప్రతినిధుల సమావేశం

**హైదరాబాద్, ఏప్రిల్ 2, సిరి న్యూస్‌టుడే:**

ఫ్లోరిడా విశ్వవిద్యాలయం(Florida University) సహజ వనరులు, పర్యావరణ పాఠశాల డైరెక్టర్ డా. కె.రమేష్ రెడ్డి నాయకత్వంలోని ప్రతినిధుల బృందం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు (Minister Thummala Nageshwar Rao) ను గురువారం మర్యాదపూర్వకంగా కలిసి తెలంగాణలో వ్యవసాయ అభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంతో కలిసి పరిశోధన, విస్తరణ, విద్యా రంగాల్లో సంయుక్త భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేయాలని ఫ్లోరిడా విశ్వవిద్యాలయం తరపున ప్రతిపాదించారు.

అలాగే రాష్ట్ర ప్రభుత్వం, ఉద్యాన విశ్వవిద్యాలయం, ఫ్లోరిడా విశ్వవిద్యాలయం కలిసి తెలంగాణ డిజిటల్, సుస్థిర వ్యవసాయ వ్యవస్థల కేంద్రం (టీడీఎసఏసీ) స్థాపనపై కూడా చర్చించారు. ఈ భాగస్వామ్యం ద్వారా డిజిటల్, ఖచ్చిత వ్యవసాయం, ఏఐ ఆధారిత వ్యవస్థలు, రిమోట్ సెన్సింగ్, డ్రోన్ టెక్నాలజీ వంటి ఆధునిక పద్ధతులను వ్యవసాయ రంగంలో ప్రవేశపెట్టే అవకాశం ఉందన్నారు. అలాగే వాతావరణ మార్పులకు అనుగుణమైన పంటలు అభివృద్ధి, నేల ఆరోగ్య సంరక్షణ, నీటి వినియోగ సమర్థత పెంపు వంటి అంశాలపై ప్రతినిధులు తమ అభిప్రాయాలను వెల్లడించారు.

ప్రత్యేకంగా తెలంగాణలో స్ట్రాబెర్రీ, బ్లూబెర్రీ వంటి అధిక విలువ పంటల సాగు, వాటికి సంబంధించిన ప్రాసెసింగ్ టెక్నాలజీలు, పరిశ్రమల స్థాపన ద్వారా రైతులకు అధిక ఆదాయం అందించే అవకాశాలపై కూడా చర్చ జరిగింది. రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్, విలువ ఆధారిత పరిశ్రమలను అభివృద్ధి చేసి రైతులకు మార్కెట్ అవకాశాలను విస్తరించే దిశగా కలిసి పనిచేయొచ్చని ప్రతినిధులు సూచించారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని సాంకేతికంగా బలోపేతం చేయడం, రైతుల ఆదాయం పెంచడం దిశగా ఇలాంటి అంతర్జాతీయ భాగస్వామ్యాలు కీలక పాత్ర పోషిస్తాయని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.



ఈ కార్యక్రమాల అమలుకు సంబంధించి ఒక టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో మాజీ ఎన్జీరంగా యూనివర్సిటీ వీసీ డాక్టర్ ఎస్.రఘువర్ధన్ రెడ్డి, కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాల

# కాంగ్రెస్ మోసాలను ఎండగట్టాలి

- పార్టీ శ్రేణులకు బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు పిలుపు

**సంగారెడ్డి, ఏప్రిల్ 2, సిరి న్యూస్‌టుడే:**

కాంగ్రెస్ ప్రభుత్వ మోసా లను సోషల్ మీడియా వేదికగా ఎండగట్టాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి.హరీష్‌రావు (Harish rao )పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పటాన్‌చెరు నియోజక వర్గం బొల్లారంనకు చెందిన కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఎండి. ఆరిఫ్, మరో 25 మంది సభ్యులు బీఆరఎస్ సీనియర్ నాయకుడు బాలరెడ్డి ఆధ్వర్యంలో గురువారం బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయాల్లో ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉండాలంటే సోషల్ మీడియాలో అత్యంత చురుగ్గా ఉండాల్సిన అవసరం ఉందన్నారు.
గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రజా సమస్యలను వెలుగులోకి తేవడంలో సోషల్ మీడియానే నేడు కీలక పాత్ర పోషిస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యంగా రాష్ట్ర యువతను తీవ్రంగా దగా చేసిందని, ఎన్నికలకు ముందు అమలుకాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక నిలువునా ముంచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జాబ్ క్యాలెండర్ లేదు.. కొత్తగా ఉద్యోగాల కల్పన లేదు.. వారు చెప్పిన రెండు లక్షల ఉద్యోగాల హామీ పూర్తిగా బోగస్ అని తేలిపోయింది అని విమర్శించారు. యువతతోపాటు రాష్ట్రంలోని అన్ని వర్గాలను కాంగ్రెస్ ప్రభుత్వం వంచించిందని మండిపడ్డారు. అవ్వాతాతలకు పెన్షన్లు పెంచకుండా, కోటిమంది మహిళలకు నెలకు రూ.2500 చొప్పున ఇవ్వకుండా, రైతన్నలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోకుండా ప్రతి వర్గాన్నీ దారుణంగా మోసం చేసిందన్నారు.
ఈ ప్రభుత్వ తీరుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే యువత ముందుకొచ్చి ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ పటాన్‌చెరు ఇన్‌చార్జి ఆదర్శ్ రెడ్డి, స్థానిక నాయకులు

# కాళేశ్వరం పేరుతో ప్రజాధనం లూటీ

- ఏటీఎంలా ప్రాజెక్టును వాడుకున్నారు
- ఐదు మండలాలపై నాడు నోరు మెదపలేదు
- అవినీతిపై కేసీఆర్‌ను జైలుకు పంపుతామన్న కాంగ్రెస్
- రాజ్యసభలో సురేష్ రెడ్డి వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2, సిరి న్యూస్‌టుడే:**

రాజ్యసభలో అమరావతి బిల్లుపై చర్చ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంలా మారింద ని ఆరోపించారు. ఈ ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ ప్రాజెక్టు పిల్లర్లు కుంగాయని, కాళే□శ్వరం వల్ల ఉగయోగం లేదని నివేదికలు చెప్పాయని తెలిపారు. కాళేశ్వరం ప్రజల డబ్బుతో కట్టారా? లేక కేసీఆర్ సొంత డబ్బుతో కట్టారా అంటూ ప్రశ్నించారు. రూ.లక్ష కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని నిలదీశారు. వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థల నుంచి నిధులు తీసుకొని కాళేశ్వరం నిర్మించారని మంత్రి తెలిపారు. భద్రాచలంలో ఉన్న గ్రామాలు ఏపీ పునర్విభజన చట్టంలో చేర్చారని, అప్పుడు ఎందుకు ప్రశ్నించలేదని అడిగారు. విలీనం తర్వాత కూడా ఆయన సోనియాగాంధీ ఇంటికి వెళ్లారని తెలిపారు. ఎన్నికల ముందు కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ జరిపి కేసీఆర్‌ను జైలుకు పంపిస్తామని కాంగ్రెస్ చెప్పిందని, ఆయనపై ఎందుకు విచారణ జరపలేదని కిషన్ రెడ్డి నిలదీశారు. ఈ క్రమంలో కాళేశ్వరం అంశంపై రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీ సురేశ్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ చేసిన వ్యాఖ్యలపై సురేశ్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆయన తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సురేశ్‌రెడ్డి వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. మేడిగడ్డ పనికి రాకుండా పోవడానికి బీఆర్ఎస్ కారణమని, ఇదే విషయాన్ని నిపుణుల కమిటీ కూడా చెప్పిందని అన్నారు. కాళేశ్వరాన్ని కేసీఆర్ కుటుంబం ఓ ఏటీఎంలా వాడుకుందని, ఇంజినీర్లను కూడా అడగకుండా ప్రాజెక్టు చేపట్టారని విమర్శించారు. రూ.లక్ష కోట్ల ప్రజాధనాన్ని కేసీఆర్ ఇష్టమొచ్చినట్లు ఖర్చు చేశారని పునరుద్ఘాటించారు.

# చికెన్ సెంట్లర బంద్‌తో దిగివచ్చిన పౌల్ట్రీలు

- డిమాండ్లు అంగీకరించినట్లు ట్రేడర్స్ వెల్లడి

**హైదరాబాద్, ఏప్రిల్ 2, సిరి న్యూస్‌టుడే:**

చికెన్ సెం టర్ల బంద్ దెబ్బకు పౌల్ట్రీ కంపెనీలు దిగివ చ్చాయి. బర్డ్ ధరను రూ.185 నుంచి రూ. 125కి తగ్గించాయి. చికెన్ సెంటర్ల నిర్వాహకులకు ఇచ్చే మార్జిన్‌ను గతంలో మాదిరిగా నే కిలోకు రూ.15, ఆపైన ఇచ్చేందుకు ముం దుకొచ్చాయి. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని చికెన్ సెంటర్ల నిర్వాహకులు బంద్‌ను విరమించుకోవాలని నిర్ణయించుకున్నట్లు ఉ మ్మడి వరంగల్ జిల్లా బ్రాయిలర్ ట్రేడర్స్ అసోసియేషన్ నేతలు తెలిపారు. బంద్‌ను విజయవంతం చేసినందుకు చికెన్ సెంటర్ల నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు. ఒక్కరోజు చికెన్ సెంటర్ల బంద్‌తో నాటు కోళ్లకు డిమాండ్ పెరిగింది.
బ్రాయిలర్ కోళ్ల అమ్మకాలు లేకపోవడంతో మాంసం ప్రియు లు నాటు కోళ్లను ఎక్కువగా కొనుగోలు చే శారు. నాటు కోడి రేటు సాధారణంగా ఎక్కు వగానే ఉంటుంది కనుక మామూలు రోజుల్లో వీటి అమ్మకాలు తక్కువ. బంద్‌తో నాటు కోళ్ల పెంపకందారులు వీటిని మార్కెట్‌కు తరలించగా సాధారణ ధరకన్నా ఎక్కువైనా వినియోగదారులు కొనుగోలు చేశారు. చికె న్ సెంటర్ల బంద్‌తో మాంసం విక్రయాలు కూడా 20 నుంచి 25 శాతం పెరిగినట్లు మాంసం విక్రయదారులు తెలిపారు. చికెన్ అమ్మకాలు లేకపోవడంతో ప్రత్యామ్నాయం గా మాంసం కొనుగోలు చేయడానికి ఎక్కువ మంది మొగ్గు చూపారు. చికెన్ సెంటర్ల బంద్‌లో భాగంగా బుధవారం హైదరాబాద్ లోని ఇందిరా పార్క్ వద్ద జరిగిన మహా ధర్నాలో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి చికెన్ సెంటర్ల నిర్వాహకులు పాల్గొన్నారు. తమ డిమాండ్లను తక్షణం పరిష్కరించాలని నినా దాలు చేశారు. అవసరమైతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకోవాలని, విధానపరంగా చికెన్ ధరలు, కమీషన్ మార్జిన్ ధరలు నిర్ణయించాలని, చిల్లర చికెన్ వ్యాపారులు లేకుండా చేయాలని, పౌల్ట్రీ కంపెనీల కుట్రను అడ్డుకోవాలని కోరుతూ నినాదాలు చేశారు.



# తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరుస్తారా?

- ఆ మండలాలను అప్పగించిన పాపం బీజేపీదే
- కాళేశ్వరంపై రేవంత్ దుష్ప్రచారాన్నే వల్లెవేశారు
- నాడు ప్రశంసలు.. నేడు రాజకీయ లబ్ది కోసం అబద్ధాలు
- ఈ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తూనే గొంతు కోస్తారా
- రాజ్యసభలో కిషన్‌రెడ్డి వ్యాఖ్యలపై హరీశ్‌రావు ధ్వజం

**హైదరాబాద్, ఏప్రిల్ 2, సిరి న్యూస్‌టుడే:**

రాజ్యసభలో కేంద్ర మం త్రి కిషన్ రెడ్డి పచ్చి అబద్ధాలతో, చరిత్ర వక్రీకరణలతో తనలోని వికృతత్వాన్ని బయట పెట్టుకున్నారని, తెలంగాణ ఉద్యమంలో రాజీనామా చేయక వెన్నుచూపి పారిపోయిన కిషన్‌రెడ్డి (MP Kishan Reddy) నేడు పార్లమెంట్ సాక్షిగా మరోసారి ద్రోహానికి పాల్పడ్డాడని బీఆరఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి. హరీష్‌రావు (MLA Harish Rao ) ధ్వజమెత్తారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ భద్రాచలం ప్రాంతంలోని ఏడు మండలాలను ఏపీకి అప్పగించాలనేది విభజన చట్టంలో ఉందని కిషన్ రెడ్డి పేర్కొనడం చారిత్రక అవాస్తవమే కాదు.. తెలంగాణకు చేస్తున్న తీరని ద్రోహం అని అన్నారు. విభజన చట్టానికి సవరణ తెచ్చి ఆర్డినెన్స్ ద్వారా ఏడు మండలాలను ఏపీకి కట్టబెట్టింది ముమ్మాటికీ□ బీజేపీ ప్రభుత్వమేనని, ఈ పాపంలో కిషన్ రెడ్డికి కూడా పాత్ర ఉందని అన్నారు.
ఆనాడు ముఖ్యమంత్రిగా కేసీఆర్ తెలంగాణ బంద్‌కు పిలుపునిచ్చి మీరు చేసిన ద్రోహాన్ని ఎండగట్టిన విషయాన్ని మర్చిపోయి నేడు ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంట అన్నట్లు పార్లమెంటు సాక్షిగా చరిత్ర వక్రీకరణకు పాల్పడి ఈరోజు తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానించారు.. ఇది మీ కుట్రకు నిదర్శనం.. కాళేశ్వరంపై రేవంత్ రెడ్డి చేస్తున్న తప్పుడు ప్రచారాన్నే కిషన్ రెడ్డి పార్లమెంట్‌లో చేయడం కాంగ్రెస్, బీజేపీ చీకటి పొత్తుకు సాక్ష్యం అని ఆయన విమర్శించారు. ప్రపంచంలోనే అతి పెద్ద బహుళ దశల ఎత్తిపోతల ప్రాజెక్టుగా కాళేశ్వరం నిర్మించడం అబద్ధమా.. 148 మీటర్ల దిగువ ప్రాంతం నుంచి 618 మీటర్ల ఎత్తుకు నీటిని ఎత్తిపోయడం అబద్ధమా.. ఈరోజు, ఈ నిమిషానికి మండుటెండల్లో సైతం కాళేశ్వరం ప్రాజెక్టు కాల్వల ద్వారా జలాలు రైతుల పొలాలకు చేరుతుండటం అబద్ధమా.. ఏది అబద్ధం కిషన్ రెడ్డీ అని ప్రశ్నించారు.

**కాళేశ్వరం జలాలను చూపించేందుకు సిద్ధం**

పొలాల్లో పారుతున్న కాళేశ్వరం జలాలను చూపించేందుకు తాను సిద్ధం.. వచ్చేందుకు మీకు దమ్ముందా అని హరీష్‌రావు సవాల్ విసిరారు. మీరు కేబినెట్ మంత్రిగా ఉండి ఏ ప్రభుత్వం అయినా ప్రజా ధనంతోనే నిర్మాణాలు చేస్తుందన్న ఇంగితం మరిచి కేసీఆర్ జేబులోంచి డబ్బు ఖర్చు పెట్టారా అని అడగడం మీ అవివేకానికి, అతి తెలివికి నిదర్శనమని మండిపడ్డారు. మీ ప్రభుత్వం నిర్మిస్తున్న జాతీయ రహదారులు, ప్రాజెక్టులకు మీ సొంత పైసలు ఖర్చు పెడుతున్నారా.. ఆ పైసలు దుబాయ్‌లో ముద్రిస్తున్నారా లేక మీ జేబుల్లో నుండి ఖర్చు చేస్తున్నారా అని నిలదీశారు. కాళేశ్వరం వల్ల ఉపయోగం లేదని గొంతు చించుకున్న కిషన్ రెడ్డి గారూ.. గతంలో మీ ప్రభుత్వ పెద్దలే నితిన్ గడ్కరీ నుంచి సీడబ్ల్యూసీ చైర్మన్ మసూద్ వరకు కాళేశ్వరంపై కురిపించిన ప్రశంసలు అబద్ధం అంటారా.. అవివేకం అంటారా.. నిన్నగాక మొన్న పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎకనామిక్ సర్వే ఆఫ్ ఇండియా(చాప్టర్ 8) రిపోర్టు ప్రకారం '2014లో తెలంగాణలో 1.31 కోట్ల ఎకరాలుగా ఉన్న సాగు విస్తీర్ణం 2023 నాటికి ఏకంగా 2.2 కోట్ల ఎకరాలకు పెరిగింది. దీనికి ప్రధాన కారణం



కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ కాకతీయ పథకాలే అని కుండబద్దలు కొట్టింది. ఇది మీ కళ్లకు కనిపించడం లేదా అని అడిగారు. పూటకో తీరు మాట్లాడటం రాజనీతి అనిపించుకోదన్నారు. కేంద్ర ప్రభుత్వం విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలని, తెలంగాణకు నిధులు కేటాయించాలని తమ ఎంపీ సురేష్ రెడ్డి మాట్లాడితే మీరు దాన్ని సమర్థించకపోగా ఉల్టా వ్యర్థ రాజకీయ ప్రేలాపనలకు పాల్పడ్డారన్నారు. ఎనిమిది మంది మీ ఎంపీలు, ఎనిమిదిమంది కాంగ్రెస్ ఎంపీలు ఉండి తెలంగాణవాదాన్ని తొక్కిపెట్టడం సిగ్గుచేటు అని హరీష్‌రావు అన్నారు.

# పర్సెంటేజీల ప్రకారమే సినిమాల ప్రదర్శన

- నేటి నుంచే ఈ విధానం అమలు
- 23 సింగల్ స్క్రీన్ థియేటర్ యాజమాన్యాల ప్రకటన

**హైదరాబాద్, ఏప్రిల్ 2, సిరి న్యూస్‌టుడే:**

తెలంగాణ ఎగ్జిబిటర్లు కీలక నిర్ణయం తీసుకున్నారు. మల్టీప్లెక్స్ తరహాలో పర్సంటేజీ విధానంలోనే సినిమాలను ప్రదర్శించాలని హైదరాబాద్‌లోని 23 సింగిల్‌స్క్రీన్ థియేటర్ల యాజమాన్యాలు నిర్ణయించాయి. ఏప్రిల్ 3 నుంచి ఇది అమల్లోకి రానుంది. ఎగ్జిబిటర్లకు రెవెన్యూ షేర్ ఇలా.. సినిమా ప్రదర్శితమైన తొలివారం 60 శాతం, రెండోవారం 50 శాతం, మూడోవారం 40 శాతం. ఈ మేరకు తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రకటన విడుదల చేసింది. 23 మంది ఎగ్జిబిటర్లు తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ను ఇటీవల సంప్రదించి.. తెలంగాణలోని పలువురు అగ్ర శ్రేణి డిస్టిబ్యూటర్లతో చర్చలు జరిపినట్లు తెలిపారు. వారి థియేటర్లు ముఖ్యమైన ప్రదేశాల్లో ఉన్న ప్రీమియం థియేటర్లని, వాటిలో ప్రేక్షకులకు అన్ని సౌకర్యాలున్నాయని, అయితే ఈ థియేటర్ల నిర్వహణకు చాలా ఖర్చవుతోందన్నారు. ప్రస్తుత అద్దె విధానంతో వారు మనుగడ సాగించలేకపోతున్నామని తెలిపారు. పర్సంటేజీ ప్రాతిపదికన సినిమాలను ప్రదర్శిస్తామన్న తమ ప్రపోజల్‌ను డిస్టిబ్యూటర్లు అంగీకరించారని చెప్పారు. శశిధర్ రెడ్డి మాత్రమే నిర్మాతలు, ఇతర భాగస్వాములతో మరింత చర్చించి, ఆ తర్వాత అభిప్రాయం చెబుతామన్నారని పేర్కొన్నారు. ఇకపై తెలంగాణలోని అన్ని సింగిల్ స్క్రీన్‌లలో సినిమాలను కేవలం శాతం ప్రాతిపదికనే ప్రదర్శిస్తామని, ఇది విడతల వారీగా జరుగుతుందని ఎగ్జిబిటర్లు తెలిపారని ఫిల్మ్ ఛాంబర్ ప్రకటనలో పేర్కొంది. మార్చి 11న బెంగళూరులో జరిగిన దక్షిణ భారత



ఎగ్జిబిటర్ల సమావేశం లోనూ దీనిపై ఏకగ్రీవ నిర్ణయం తీసుకున్నారు. మన తెలుగు రాష్ట్రాలు మినహా దేశంలోని అన్ని రాష్ట్రాల సింగిల్ స్క్రీన్‌లు పర్సంటేజీ విధానాన్ని మాత్రమే అనుసరిస్తున్నాయి. సింగిల్ స్క్రీన్‌ల మనుగడ కోసమే ఈ నిర్ణయం తీసుకున్నాం' అని డిస్టిబ్యూటర్లు, సినీ నిర్మాతలకు ఫిల్మ్ ఛాంబర్ తెలిపింది. రెంటల్ విధానానికి బదులు పర్సంటేజీ విధానంలో సినిమాల ప్రదర్శన కోసం ఎప్పటి నుంచో ఎగ్జిబిటర్లు డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు 23 థియేటర్ల యాజమాన్యాలు ముందడుగు వేశాయి.

# ఏప్రిల్ 24 నుంచి స్కూళ్లకు వేసవి సెలవులు

- అధికారికంగా ప్రభుత్వం ఉత్తర్వులు

**హైదరాబాద్, ఏప్రిల్ 2. సిరి న్యూస్‌టుడే:**

ఈ నెలాఖరు నుంచి స్కూళ్లకు సెలవులు ప్రారంభం కానున్నాయి. నెలాఖరులోగా సిలబస్ పూర్తి చేసి, పరీక్షలు నిర్వహించాలని విద్యాశాఖ ఇప్పటికే ఆదేశాలు ఇచ్చింది. ఎండలు దంచికొడుతున్న క్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఊరటనిచ్చే వార్త చెప్పింది. వేసవి సెలవుల షెడ్యూల్‌ను అధికారికంగా ఖరారు చేసింది. వేసవిలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని స్కూళ్లకు సెలవులను అధికారులు ముందుగానే ప్రకటించారు. విద్యాశాఖ తాజా ప్రకటన ప్రకారం.. తెలంగాణలోని స్కూళ్లకు ఈ ఏడాది ఏకంగా 48 రోజుల పాటు వేసవి సెలవులు ఉండనున్నాయి. ఏప్రిల్ 24వ తేదీ నుంచి జూన్ 11వ తేదీ వరకు ఈ సెలవులు అమల్లో ఉంటాయి. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలకు ఈ నిబంధన వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. సుదీర్ఘ వేసవి సెలవుల అనంతరం జూన్ 12న తిరిగి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. సెలవులు ప్రారంభమయ్యేలోపు సిలబస్ పూర్తి అయ్యేలా చూడాలని ప్రభుత్వం పాఠశాలల యాజమాన్యాలకు సూచించింది. అవసరమైతే విద్యాపరంగా ఎలాంటి అంతరాయం లేకుండా వారానికి ఒకసారి అదనపు తరగతులు నిర్వహించవచ్చని తెలిపింది.

# కాంగ్రెస్ నేత కాటా అరెస్ట్

- గ్రామంలో స్వల్ప ఉద్రిక్తత

**సంగారెడ్డి, ఏప్రిల్ 2, సిరి న్యూస్‌టుడే:**

ఆర్‌సీ పురంలోని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ ఇంటి వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిపై కాటా శ్రీనివాస్ అవినీతి ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యేపై చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉంటానని.. తడి బట్టలతో గుడిలో ప్రమాణం చేస్తానని కాంగ్రెస్ నేత తెలిపారు. అందులో భాగంగా గురువారం ఉదయం బీరంగూడ శివాలయం వద్ద ప్రమాణం చేయడానికి వాహనంలో బయలుదేరారు కాటా శ్రీనివాస్. ఇంటి బయటే పోలీసులు ఆయన వాహనాన్ని అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. శివాలయం వద్దకు వెళ్లే తీరుతానని కాటా శ్రీనివాస్ పట్టుబట్టారు. దీంతో పోలీసులు, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. తన కుటుంబ సభ్యులను గుడికి అనుమతించాలని పోలీసులను శ్రీనివాస్ కోరారు. చివరకు కాటా శ్రీనివాస్ గౌడ్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు హైదరాబాద్ వైపు తరలించారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిపై కాటా శ్రీనివాస్ అవినీతి ఆరోపణలు, కాటా శ్రీనివాస్‌పై ఎమ్మెల్యే ప్రత్యారోపణలు చేయడంతో వార్ మొదలైంది. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి తనపై చేసిన అవినీతి ఆరోపణలు నిజమైతే శివాలయంలో తడి బట్టలతో ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు. తాను ఎమ్మెల్యేపై చేసిన వ్యాఖ్యలకు పూర్తిగా కట్టుబడి ఉన్నానని, గుడిలో తడి బట్టలతో ప్రమాణం చేస్తానని కాటా శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఈ సవాల్‌పై ఎమ్మెల్యే

## కేబినెట్ విస్తరణపై ఉత్కంఠ..

# ఉండేదెవరో..ఊడెదెవరో..?

- మంత్రివర్గ విస్తరణలో ఇద్దరికే ఛాన్స్
- ఆశల పల్లకిలో పలువురు నేతలు
- పలువురు మంత్రుల్లో గుబులు
- అయిదు రాష్ట్రాల ఎన్నికల అనంతరం విస్తరణ
- సామాజిక న్యాయంపై ఇప్పటికే కసరత్తు

**హైదరాబాద్, ఏప్రిల్ 2, సిరి న్యూస్‌టుడే:**





మంత్రివర్గ విస్తరణ అనగానే ఆశావహుల మధ్య పోటీ తీవ్రంగా ఉండటం సహజం. అదే సమయంలో ప్రస్తుత మంత్రుల్లో కొందరికి తమ పదవిపై గుబులు పెరిగింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు పూర్తవుతున్న నేపథ్యంలో కేబినెట్‌లో మార్పులు తప్పవన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ మార్పుల్లో ఇద్దరు లేదా ముగ్గురు మంత్రులకు ఉద్వాసన పలికే అవకాశాలు ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కొంతమంది మంత్రులు తమ శాఖల్లో ఆశించిన స్థాయిలో పనితీరు కనబరచలేకపోయారనే అభిప్రాయం ఒకవైపు ఉండగా, మరోవైపు వారిపై వచ్చిన ఆరోపణలు కూడా మార్పులకు కారణమవుతాయని సమాచారం. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, అధిష్ఠానం పునర్వ్యవస్థీకరణపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం 16మంది మంత్రులు కొనసాగుతుండగా, మొత్తం 18 మందికి అవకాశం ఉండటంతో ఇద్దరికి కొత్తగా అవకాశం లభించనుంది. అయితే కొందరిని తప్పిస్తే మరో ముగ్గురికి అవకాశం కలిపి మొత్తం అయిదుగురికి మంత్రి పదవులు దక్కే అవకాశం ఉందని అంచనా. ఈ అయిదు స్థానాల కోసం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలిపి దాదాపు 16 మంది పోటీ పడుతున్నట్లు సమాచారం. సామాజిక వర్గాల సమతుల్యతను దృష్టిలో పెట్టుకుని కసరత్తు కొనసాగుతోంది. అసెంబ్లీ సమావేశాల తర్వాతే విస్తరణ ఉంటుందని భావించినప్పటికీ, అయిదు రాష్ట్రాల ఎన్నికల ప్రచారం కారణంగా ప్రక్రియ కొంత వాయిదా పడింది. ఎన్నికల అనంతరం కేబినెట్ విస్తరణ జరగనుందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఈసారి లంబాడా, మున్నూరు కాపు వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. రెడ్డి వర్గం నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మల్రెడ్డి రంగారెడ్డి, పరిగి రామ్మోహన్‌రెడ్డి పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. అలాగే వరంగల్ ప్రాంతానికి మరొకరికి అవకాశం ఇవ్వాలన్న డిమాండ్ నేపథ్యంలో దొంతి మాధవరెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి పేర్లు ముందుకు వస్తున్నాయి.
లంబాడా వర్గం నుంచి రాంచంద్రనాయక్, బాలూనాయక్, శంకర్‌నాయక్ పేర్లు చర్చలో ఉండగా, బీసీ వర్గం నుంచి ఎమ్మెల్సీ విజయశాంతి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. గతంలో ఇచ్చిన హామీ మేరకు ఆమెకు ఈసారి అవకాశం దక్కే అవకాశాలున్నాయని భావిస్తున్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, సీఎం సన్నిహితుడు ఆది శ్రీనివాస్ పేర్లు కూడా ప్రచారంలో ఉన్నాయి.
కేబినెట్ పునర్వ్యవస్థీకరణలో అన్ని వర్గాలకు న్యాయం చేసేలా అధిష్ఠానంతో చర్చించి తుది నిర్ణయం తీసుకునే అవకాశముంది. పదవులు కోల్పోయే వారికి అవమానం జరగకుండా పార్టీ లోపలే కీలక బాధ్యతలు ఇవ్వాలని యోచిస్తున్నారు. చీఫ్ విప్, డిప్యూటీ స్పీకర్ వంటి పదవుల్లో వారికి అవకాశం కల్పించే అవకాశాలున్నట్లు సమాచారం.

## పౌర్ణమి సందర్భంగా చండీ హోమం

- భద్రకాళి సహిత వీరభద్ర స్వామి ఆలయంలో ఆధ్యాత్మిక వైభవం



**గుమ్మడిదల, ఏప్రిల్ 2( సిరి న్యూస్):**

భద్రకాళి సహిత వీరభద్ర స్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా చండీ హోమ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని హోమగుండంలో గురువారం నిర్వహించిన ఈ చండీ హోమంలో ప్రత్యేక పూజలు, వేద మంత్రోచ్చారణల మధ్య యజ్ఞకార్యాలు నిర్వహించబడ్డాయి. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయంలో ప్రతి పౌర్ణమి రోజున చండీ హోమ కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు అమావాస్య సందర్భంగా రుద్ర హోమ కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తున్నట్లు ఆలయ సిబ్బంది తెలిపారు. ఈ హోమ కార్యక్రమాల్లో ఎవరైనా భక్తులు పాల్గొని పూజలు చేయించుకోవచ్చని తెలిపారు.పౌర్ణమి సందర్భంగా నిర్వహించిన ఈ చండీ హోమం ద్వారా శాంతి, ఐశ్వర్యం కలుగుతాయని అర్చకులు పేర్కొన్నారు. కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సోమయ్య అర్చకులు పాల్గొన్నారు.


## నీటి సమస్య పరిష్కారానికి బోరు ఏర్పాటు



**గుమ్మడిదల, ఏప్రిల్ 2(సిరి న్యూస్):**

గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు వీరన్నగూడెంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వార్డు కౌన్సిలర్ షేక్ గౌసియా హుస్సేన్ ప్రత్యేక చొరవ తీసుకుని బోరు ఏర్పాటు పనులను ప్రారంభించారు. కౌన్సిలర్ షేక్ గౌసియా హుస్సేన్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై బోరు త్రవ్వక పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో మున్సిపాలిటీ ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించదని తెలిపారు. పట్టణంలోని ప్రతి వార్డులో సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. వీరన్నగూడెంలో నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఈ బోరు ఉపయుక్తంగా మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువస్తే త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ రాజశేఖర్, నాయకుడు వేణు, ఇతర నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సీఎం ఫండ్ పంపిణీ



**మునిపల్లి ఏప్రిల్ 2 (సిరి న్యూస్)**

మేళాసంఘం గ్రామానికి చెందిన పడమటి పరవయ్యకు సీఎం రిలీఫ్ ఫండ్‌ను గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అంజిరెడ్డి కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు గోదావరి అంజిరెడ్డి,బీజేపీ రాష్ట్ర నాయకులు దేశ్పాండే, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు వెంకట నరసింహ రెడ్డి, మునిపల్లి బీజేపీ మండల అధ్యక్షులు పడమటి నాగిశెట్టి, పార్టీ నాయకులు సంగమేశ్వర్ స్వామి పాల్గొన్నారు.

## భక్తులకు పప్పు, పానకం ప్రసాదం వితరణ



**సదాశివపేట. ఏప్రిల్ 2. (సిరి న్యూస్)**

లోపలి కోట హనుమాన్ మందిరంలో హనుమాన్ జన్మదినోత్సవ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తి పాటలతో భజనలు నిర్వహించారు. 18 వ వార్డు కౌన్సిలర్ బిట్ల నికిత ప్రేమ్ కుమార్ , 19వ వార్డు కౌన్సిలర్ పట్లూరి రోజా నాగరాజుగౌడ్ , ఆలయ కమిటీ అధ్యక్షులు నాగారం శ్రీనివాస్ ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు పప్పు పానకం ప్రసాదం పంపిణీ చేయడం జరిగింది.అనంతరం 19వ వార్డు కౌన్సిలర్ పట్లూరి రోజా నాగరాజు గౌడ్ జన్మదిన సందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేయించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ డైరెక్టర్లు గాజుల అశోక్, పోల మనోహర్, జయరామ్ మనోహర్, పోల సంగమేశ్వర్, బాలరాజ్, పద్మ గణేష్ లోపలి కోట పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# వడియారం గ్రామాన్ని ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దాలి

- క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించడంలో, సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలుకే గ్రామసభలు.
- నిర్వహణ.. అవసరాలను గుర్తించి, సత్వర పరిష్కారానికి అధికారుల గ్రామ బాట.
- గ్రామ స్థాయిలో పాలన పారదర్శకంగా ఉండాలనే పటిష్టంగా గ్రామసభలు
- జిల్లాలో ప్రశాంతంగా మొదటి రోజు గ్రామ సభలు నిర్వహణ
- ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించి గ్రామసభను ప్రారంభించిన కలెక్టర్ ప్రతిమ సింగ్.



**రామాయంపేట, (వడియారం) ఏప్రిల్ 2 (సిరిన్యూస్)**

99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా... గురువారం జిల్లాలోని చేగుంట మండలంలోని వడియారం గ్రామ పరిధిలో గల గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభను ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్. హాజరయ్యారు.అనంతరం ముఖ్యమంత్రి సందేశాన్ని, గ్రామ పంచాయతీ నివేదికను పంచాయతీ సర్పంచ్ గ్రామ సభలో చదివి వినిపించాగా, పలువురు సంక్షేమ పథకాలు పొందిన లబ్దిదారులు వారి అభిప్రాయాలను వెల్లడించారు.అదే విధంగా నూతన పథకాలైన ముఖ్యమంత్రి అల్పాహారం పథకం, ఇందిరమ్మ జీవిత కుటుంబ బీమా, మధ్యాహ్న భోజన పథకం – ఇంటర్మీడియట్ కు విస్తరణ, విభిన్న ప్రతిభావంత ఇంటర్మీడియట్ విద్యార్థులకు మోటారు వాహనాలు, పంటల వైవిధ్యం, సహజ సేంద్రీయ వ్యవసాయం పథకాలపై అవగాహన కల్పించారుఅలాగే వివిధ పథకాల లబ్దిదారులు ఈ సందర్భంగా వారి అభిప్రాయాలను తెలియజేస్తూ.. ప్రజా ప్రభుత్వంలో నిరుపేద లైన తమకి వివిధ రకాల సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందని హర్షం వ్యక్తం చేశారు..సందర్భంగా గ్రామసభను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ., చేగుంట మండలం వడియారం గ్రామపంచాయతీ నీ జిల్లాలోనే ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దాలని సూచించారు. గ్రామస్తులకు ప్రభుత్వ ప్రయోజనాలను చేరువ చేస్తున్నామన్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను జిల్లాలో పకడ్బందీగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ గ్యారంటీ పథకాలతో పాటు, కొత్త రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అన్ని హాస్టళ్లు, స్కూళ్లలో డైట్ ఛార్జీలు, కాస్మెటిక్ ఛార్జీలను పెంచడం ద్వారా పేద విద్యార్థులకు మెరుగైన ఆహారం, వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు.వడియారం గ్రామ పంచాయతీలో మొదటి విడతగా సుమారు 32 ఇండ్లు, నూతన రేషన్ కార్డులు 188,ఆరోగ్య శ్రీ లో 151 మందికి లబ్ధి, గృహ జ్యోతి 574 మంది లబ్ది దారులు, రుణ మాఫీ 166 మంది రైతులకు, చేయూత పెన్షన్ ద్వారా 513 మంది, కళ్యాణ లక్ష్మి 25 మంది కి లబ్ది చేకూరిందని తెలిపారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు అందుతాయన్నారు.మహిళా సాధికారత కొరకు మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, స్కూల్ యూనిఫాం కుట్టే పనులు, ఆర్టీసీ డ్రైవింగ్ శిక్షణ వంటి కార్యక్రమాల ద్వారా ఆర్థికంగా బలోపేతం చేయడం జరుగుతుందన్నారు. గ్రామాలలో ఉన్న తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీ వంటి సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని ప్రజలకు ,గ్రామాల్లోని సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించడమే ఈ సభల ముఖ్య ఉద్దేశమని అన్నారు. ముఖ్యంగా ఇంద్రమ్మ ఇళ్ల ఎంపిక ప్రక్రియను రాజకీయాలకు అతీతంగా, పారదర్శకంగా గెజిటెడ్ అధికారుల సమక్షంలో నిర్వహిస్తున్నామని, అర్హులైన ప్రతి పేదవాడికి ఇల్లు అందేలా నాలుగు విడతల్లో ఈ పథకాన్ని అమలు చేస్తామని భరోసా ఇచ్చారు. గ్రామంలో సిసి రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి కోసం కొత్త బోరుబావుల మంజూరు వంటి అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే, వేసవి దృష్ట్యా విద్యుత్ వినియోగంపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అధికారులు ఫోన్లకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలని ఆదేశిస్తూ, అధికారుల సమన్వయంతో జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్నారు.గ్రామ అభివృద్ధి కోసం ప్రజల భాగస్వామ్యం కీలకమని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం, పిల్లల విద్యపై దృష్టి పెట్టడం, ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ వహించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.గ్రామ సభలో ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వాటిని సంబంధిత శాఖల అధికారులు నమోదు చేసి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో , ప్రత్యేక అధికారిణి హేమ భార్గవి,, సర్పంచ్ సాయికుమార్,మెడికల్ ఆఫీసర్ అనిల్ కుమార్ రెడ్డి, ఉపసర్పంచ్ బందారి నాగరాజు, పంచాయతీ కార్యదర్శి,ఇన్చార్జి ఎం.పీ.ఓ, విజయపాల్ ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాంనగర్‌లో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

- చైర్మన్ కుమార్ గౌడ్

**గుమ్మడిదల, ఏప్రిల్ 2 (సిరి న్యూస్):**



ఎండాకాలంలో ప్రజలు తాగునీటి సమస్య వల్ల తీవ్ర ఇబ్బందులు గురికా వద్దనే ఉద్దేశంతో ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు రాంనగర్‌లో నెలకొన్న నీటి కొరత సమస్యపై వెంటనే స్పందించి, నిరుపయోగంగా ఉన్న బోరు బావిని పునరుద్ధరించి, దానికి కొత్త మోటార్‌ను ఏర్పాటు చేసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రజలకు తాగునీరు అందించడం మున్సిపాలిటీకి అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశం. ఎండాకాలంలో నీటి కొరత తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున ముందుగానే సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రాంనగర్‌లో బోరు మోటార్ ఏర్పాటు ద్వారా స్థానిక ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తగ్గుతాయని అన్నారు. భవిష్యత్తులో కూడా ఎక్కడైనా నీటి సమస్యలు తలెత్తితే వెంటనే స్పందించి పరిష్కార మార్గం చూపుతామని తెలిపారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా మున్సిపాలిటీ దృష్టికి తీసుకురావాలని కోరారు.అన్ని వార్డుల్లో నీటి సరఫరా సక్రమంగా ఉండేలా ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని, అవసరమైతే అదనపు బోర్లు, మోటార్లు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూస్తామని చెప్పారు.బోరు మోటార్ ప్రారంభం కావడంతో రాంనగర్ కాలనీ మహిళలు, స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, మహిళలు, సీకేజీ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ముదిరాజ్ సంఘం ఐక్యతతో ముందుకు తీసుకెళ్తాం

- అధ్యక్షుడు మస్కూరి కృష్ణ
- అన్నారం ముదిరాజ్ సంఘం నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక

**గుమ్మడిదల, ఏప్రిల్ 2 (సిరి న్యూస్):**



గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం గ్రామ ముదిరాజ్ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా మస్కూరి కృష్ణను ఎంపిక చేయగా, ఉపాధ్యక్షుడిగా దర్గ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా దేశబోయిన లక్ష్మణ్, కోశాధికారిగా చింతగుడ్డి రవి, సహాయ కార్యదర్శిగా చింతగుడ్డి అశోక్, కార్యవర్గ సభ్యులుగా దేశబోయిన రాజు, గుండ్ల విజయ్ కుమార్, దర్గ స్వామి, మస్కూరి స్వామి, చింతగుడ్డి కుమార్, చింతగుడ్డి లక్ష్మి, దర్గ అంజమ్మ, చింతగుడ్డి సువర్ణ, దర్గ లావణ్య, కోళ్ళ శోభలను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మస్కూరి కృష్ణ మాట్లాడుతూ ముదిరాజ్ సంఘం ఐక్యతతో ముందుకు సాగాలని, సంఘ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సభ్యుల సమస్యలను పరిష్కరించేందుకు కట్టుబడి పనిచేస్తామని, యువతకు అవకాశాలు కల్పిస్తూ సమాజ అభివృద్ధికి దోహదపడే కార్యక్రమాలను చేపడతామని తెలిపారు. విద్య, ఉపాధి, సామాజిక అభివృద్ధి రంగాల్లో ముదిరాజ్ సంఘం మరింత ముందుకు వెళ్లేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గ్రామంలో ఐక్యత, పరస్పర సహకారం పెంపొందించడం ద్వారా సంఘాన్ని బలోపేతం చేస్తామని అన్నారు. సంఘం అభివృద్ధి కోసం అందరూ కలిసి పనిచేస్తే మరిన్ని విజయాలు సాధించగలమని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు, పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు ఎలక్ట్రిక్ ఆటో అవసరం

- సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి
- నూతన ఎలక్ట్రిక్ ఆటో ప్రారంభం

**గుమ్మడిదల, ఏప్రిల్ 2 (సిరి న్యూస్):**



పర్యావరణ పరిరక్షణకు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం కీలకమని సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలోని సిజిఆర్ ట్రస్ట్ కార్యాలయం వద్ద ఆటో యూనియన్ అధ్యక్షుడు శివకు చెందిన నూతన ఎలక్ట్రిక్ ఆటోను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యం మన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని, ఇలాంటి పరిస్థితుల్లో పర్యావరణానికి హాని కలగకుండా ఉండే ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించడం అత్యంత అవసరమని అన్నారు. ఈ పారిశ్రామిక వాడ ప్రాంతంలో ఇలాంటి వాహనాలు అత్యవసరమన్నారు. భవిష్యత్తులో ఇంధన వనరులు తగ్గిపోతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ శక్తి వనరులను వినియోగించే వాహనాలే స్థిరమైన పరిష్కారమని పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ ఆటోలు శబ్ద కాలుష్యాన్ని తగ్గించడమే కాకుండా వాయు కాలుష్యాన్ని నియంత్రిం చడంలో కూడా ముఖ్య పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రజలు, ముఖ్యంగా యువత ఆటో డ్రైవర్లు ఇలాంటి పర్యావరణ హిత వాహనాల వైపు మళ్లాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం కూడా ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించే విధంగా పలు రకాల ప్రోత్సాహకాలు అందించాలని అన్నారు. పట్టణాలలో కాలుష్య నియంత్రణకు ఇది మంచి మార్గమని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సత్యనారాయణ, సూర్యనారాయణ, ఆటో యూనియన్ సభ్యులు లక్ష్మీపతి, శ్రీకాంత్, శ్రీశైలం, ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గుమ్మడిదలలో అయ్యప్ప స్వామి పడిపూజ

- అయ్యప్ప స్వామి జన్మదినం సందర్భంగా
- పాల్గొన్న మాలాధారణ చేసే స్వాములు
- మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు



**గుమ్మడిదల, ఏప్రిల్ 2 (సిరి న్యూస్):**

శ్రీ అయ్యప్ప స్వామి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని గుమ్మడిదలలో భక్తి భావం వెల్లివిరిసింది. ఈ సందర్భంగా బుధవారం రాత్రి అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో మహా పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పురపాలక సంఘం కేంద్రంలోని కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అయ్యప్ప పడిపై భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు చేపట్టారు. పూజా కార్యక్రమం ప్రారంభం నుంచి చివరి వరకు ఆలయం అంతా భక్తులతో కిటకిటలాడింది. అయ్యప్ప భజనలు, హారతులు, మంగళ వాద్యాలతో దేవాలయం దద్దరిల్లిపోయింది. భక్తులు స్వామియే శరణం అయ్యప్ప నినాదాలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించారు. గురుస్వాముల ఆధ్వర్యంలో సంప్రదాయ పద్ధతుల్లో పూజలు నిర్వహించగా పాల్గొన్న భక్తులందరూ విశేషంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు సారెడ్డి గారి పద్మ, ఆకుల మాధవి, కత్తుల రమేష్, సేవా సమితి సభ్యులు, గురుస్వాములు కిరణ్ కుమార్, సత్యనారాయణ, మంగయ్య, ఆనంద్ యాదవ్, భాస్కర్, మధుసూదన్ రెడ్డి, విజయ్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

**అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న చైర్మన్**

అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజల్లో పాల్గొని అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ అయ్యప్ప స్వామి భక్తి మనకు నియమ నిష్ఠలు, సహనం, సమానత్వం వంటి గొప్ప విలువలను నేర్పిస్తుంది. ఇటువంటి పవిత్రమైన పడిపూజ కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించడం సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తుంది. అయ్యప్ప స్వామి ఆశీస్సులతో ప్రతి ఒక్కరి జీవితంలో శాంతి, సౌఖ్యం నెలకొనాలని ఆయన తెలిపారు.

# మంబాపూర్‌లో వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు

- శోభాయాత్రలు, భజనలు, అన్నదానంతో భక్తి సందడి




**గుమ్మడిదల, ఏప్రిల్ 2 (సిరి న్యూస్):**

గుమ్మడిదల మండల పరిధిలోని మంబాపూర్ గ్రామంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామం మొత్తం ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగిపోయింది. గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఉత్సవాల సందర్భంగా ముందుగా గ్రామంలోని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం గ్రామ ప్రధాన వీధుల గుండా భారీ శోభాయాత్రను నిర్వహించారు. ఈ ర్యాలీలో భక్తులు జై శ్రీరామ్, జై హనుమాన్ నినాదాలతో గంభీరంగా ముందుకు సాగారు. డప్పులు, భజనలు, కీర్తనలు, మంగళ వాద్యాల నడుమ సాగిన ఈ శోభాయాత్ర గ్రామమంతటా భక్తి ఉత్సాహాన్ని నింపింది.ర్యాలీ ప్రధాన రహదారి ప్రక్కన ఉన్న బస్టాండ్ సమీప హనుమాన్ ఆలయం వద్దకు చేరుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ప్రసాదాన్ని పంపిణీ చేశారు. చిన్నా పెద్దా తేడా లేకుండా గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నదానాన్ని స్వీకరించారు.

ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు గ్రామంలో ఐక్యతను పెంపొందించడమే కాకుండా, యువతలో ధార్మిక చైతన్యాన్ని పెంచుతాయని పేర్కొన్నారు. స్వామి వారి ఆశీస్సులతో గ్రామంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొనాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, యువకులు, మహిళలు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# ఆర్టీసియన్ల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి!






- ఐఎన్టియూసి 327 రాష్ట్ర కార్యదర్శి ఇనుగల శ్రీధర్
- మింట్ కాంపౌండ్ కార్యాలయంలో ఆర్టీసియన్ల నిరసనకు కు మద్దతు !!!

**హైదరాబాద్ ఏప్రిల్ 2:(సిరి న్యూస్ ).**

విద్యుత్ శాఖలో ఆర్టీసియన్ల హక్కుల సాధనకోసం జరుగుతున్న పోరాటం ఉద్రుత పరిస్థితికి చేరుకుంటుంది.తెలంగాణ వ్యాప్తంగా గత పదిరోజులుగా దశల వారిగా ఆర్టీసియన్లు తమ పోరాటాన్ని కొనసాగిస్తున్నారు.ఇందులో భాగంగా గురువారం రోజు రాష్ట్రంలోని అన్ని విద్యుత్ సర్కిల్ కార్యాలయాల ముందు వంట వార్పు కార్యక్రమాలను నిర్వహించారు.ఈ సందర్భంగా అన్ని సంఘాల నాయకులు ఆర్టీసియన్లకు మద్దతు తెలిపారు.ఒకే సంస్థ ఒకే విధానం పేరుతో జరుగుతున్న పోరాటానికి అన్ని వర్గాల మద్దతు లభిస్తోంది.ఈ సందర్భంగా విద్యుత్ శాఖ 327 రాష్ట్ర కార్యదర్శి ఎన్ శ్రీధర్ మింట్ కాంపౌండ్ లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు.విద్యుత్ శాఖలో 22 వేలకు పైగా ఉన్న కార్మికులను గత ప్రభుత్వం క్రమబద్దీకరించిన వారికి సరైన న్యాయం జరగలేదని అయన పేర్కొన్నారు.ఒకే పని చేస్తున్న వారికీ వేర్వేరుగా జీత భత్యాలు హక్కులు ఉండటం సమంజసం కాదన్నారు.తక్కువ జీతాలతో ఏండ్లుగా పనిచేస్తున్న ఆర్టీసియన్లకు యాజమాన్యం న్యాయం చేయాలని కోరారు.విద్యుత్ శాఖలో అన్మాన్ కార్మికుల పరిస్థితి మరింత దారుణంగా ఉందని వారి విషయంలోనూ యాజమాన్యం సరైన న్యాయం చేయాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు.ఉద్యమం మరింత ఉదృతమై సమ్మె దిశగా వెళ్లక మునుపే యాజమాన్యం చర్చలకు పిలవాలని అయన కోరారు.సంగారెడ్డి జిల్లాలో జరిగిన కార్యక్రమంలో 327టీజీస్పీడీసీల్ కంపనీ కార్యదర్శి భూపాల్ రెడ్డి మాట్లాడారు.యూనియన్ లు ఎన్నున్నా ఆర్టీసియన్ల పక్షన ఉంటాయని తెలిపారు.న్యాయమైన కోర్కెల కోసం చేస్తున్న నిరసన పై యాజమాన్యం సానుకూలత ప్రదర్శించాలని డిమాండ్ చేసారు.గురువారం రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన నిరసన కార్యక్రమాల్లో జిల్లా సర్కిల్ కార్యాలయాల ముందు వేలాది మంది కార్మికులు పాల్గొన్నారు.నిరసలతో మొదలైన ఆర్టీసియన్ల కార్యక్రమము ఈ నెల 7 వ తేదీన వరంగల్ లో జరిగే బహిరంగ సభతో ఉదృత దశకు చేరుకోనుంది అప్పటివరకు యాజమాన్యం స్పందించకుంటే ఇక విద్యుత్ శాఖలో సమ్మె తప్పదేమో మరి ! రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు ఆర్టీసియన్ల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం గురువారం జరిగిన వంట వార్పు కార్యక్రమం అన్ని జిల్లాలో విజయవంతమైంది. ఈ సందర్భంగా తెలంగాణ వ్యాప్తంగా జరిగిన నిరసన కార్యక్రమాలకు జిల్లాలో అన్ని యూనియన్లు సంపూర్ణ మద్దతు తెలిపాయి.జాక్ ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో అందరు స్వచ్చందంగా పాల్గొన్నారు.

# శోభయాత్రను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి

- ఎస్పి పరితోష్ పంకజ్.



**సదాశివపేట. ఏప్రిల్ 2. (సిరిన్యూస్)**

హనుమాన్ జయంతి సందర్భంగా శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయాన్ని దర్శించుకున్న సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ని మర్యాదపూర్వకంగా సన్మానించిన ఆలయ కమిటీ అధ్యక్షులు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సిహెచ్ శ్రీనివాస్ గౌడ్.సదాశివపేట పట్టణంలో హనుమాన్ నగర్ శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంలో హనుమాన్ నగర్ శ్రీ వీరాంజనేయ ఆలయాన్ని దర్శించుకున్న సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ని మర్యాదపూర్వకంగా శాలువాతో సన్మానించిన ఆలయ కమిటీ అధ్యక్షులు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సిహెచ్ శ్రీనివాస్ గౌడ్ ఆలయ నిర్మాణ పనుల గురించి, ఆలయం యొక్క ప్రత్యేకత గురించి హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహించే శోభాయాత్ర గురించి సవివరముగా జిల్లా ఎస్పీకి తెలియజేశారు. సాయంత్రం జరిగే శోభయాత్రను శాంతియుతంగా నిర్వహించాలని, శోభయాత్ర జరిగే మార్గాన్ని పరిశీలించి విశ్వహిందూ పరిషత్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు నాగులపల్లి పవన్ గౌడ్ తో కార్యక్రమం ప్రశాంతవంతమైన వాతావరణంలో విజయవంతంగా జరుపుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎనిమిదో వార్డు కౌన్సిలర్ సోమశంకర్, ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు కొలుకూరి ప్రవీణ్ కుమార్, కమిటీ సభ్యులు సుదర్శన్ రెడ్డి, బజాజ్ పవన్ కుమార్, కూచిని సతీష్, తుమ్మలపల్లి నాగేష్, బంటారం వెంకటేశం గౌడ్, శివకోటి పంతులు, ఈశ్వరయ్య, రేజింతల్ సత్యనారాయణ,బట్కారి ప్రభు, రవీందర్, సంగారెడ్డి జిల్లా నూతన గౌడ సంఘం అధ్యక్షులు పెద్ద నర్సింలు గౌడ్, కోవూరి రాఘవేందర్ గౌడ్, నల్ల కాశీనాథ్ గౌడ్, అనంత్ రెడ్డి అధిక సంఖ్యలో భక్త బృందం పాల్గొన్నారు.

# వీరాంజనేయ స్వామి ఆలయంలో డోలారోహణం, అన్న ప్రసాద వితరణ

## సంఘ సేవకులు బట్కరి ప్రభు.



**సదాశివపేట. ఏప్రిల్ 2. (సిరి న్యూస్)**

సదాశివపేటలో హనుమాన్ నగర్ కాలనీలోని శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో భట్కరి ప్రభు ఆధ్వర్యంలో మందిరంలో పూజలు, స్వామివారికి అభిషేకాలు, డోలారోహణం, పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులందరికీఅన్న ప్రసాద వితరణ భట్కరి ప్రభు దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.సాయంత్రం హనుమాన్ శోభాయాత్రలో యువకులు భక్తి గీతాలతో డీజే పాటలతో నృత్యాలు చేయడం జరిగింది. పెద్దలు భజన పాటలతో మహిళలు కోలాటాలతో శోభయాత్ర శాంతియుతంగా నిర్వహించారు.

# మొగ్ధంపల్లి లో గ్రామసభ ప్రజా సమస్యల పరిష్కారానికి చర్చ




**మునిపల్లి ఏప్రిల్ 2 (సిరి న్యూస్)**

మునిపల్లి మండల ఆయా గ్రామాల్లో ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా మగ్గుంపల్లిలో గ్రామసభ నిర్వహించారు. ఉన్నతాధికారుల సమక్షంలో జరిగిన ఈ సభలో ప్రభుత్వం గత రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలులో ఉన్న సంక్షేమ పథకాలు, వాటి ప్రయోజనాలు గ్రామస్తులకు వివరించారు.గ్రామంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, లబ్ధిదారుల సంఖ్య, సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలు వంటి అంశాలపై అధికారులు సమగ్రంగా చర్చించారు. ప్రజల నుండి ప్రత్యక్ష ఫిర్యాదులు, అభిప్రాయాలు స్వీకరించి సంబంధిత శాఖలకు పంపించారు.సభలో సర్పంచ్ సరళ, ఉప సర్పంచ్ రామలక్ష్మి, గ్రామపంచాయతి కార్యదర్శి నర్సింలు, ప్రధానోపాధ్యాయులు తెలుగు యాదగిరి, నాయకులు రసూల్ పటేల్, జంషీద్, వీరన్న, నాగిశెట్టి, ఈశ్వరప్ప, చల్మడ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# సలేశ్వరం జాతరకు పోటెత్తిన జనం

- అటవీ అధికారుల ఆంక్షల నడుమ సాగుతున్న సహాతోపేత యాత్ర ..!
- నల్లమల అడవుల్లో సలేశ్వరుని దర్శించుకుంటున్న లక్షలాది భక్తులు !!





**హైద్రాబాద్ ఏప్రిల్ 02,(సిరి న్యూస్) :**

నల్లమల అడవుల్లో ఎత్తయిన కొండల నడుమ వెలసిన సలేశ్వర స్వామి దర్శనానికి గురువారం జనం పోటెత్తారు ..యేటా చైత్ర శుద్ధ పౌర్ణమి రోజు మొదలై ఐదు రోజులపాటు మాత్రమే దర్శనం ఇచ్చే సలేశ్వర స్వామి దర్శనానికి లక్షకు పైగా భక్తులు తరలి వచ్చారు.అత్యంత సాహసోపేతమైన ఈ సలేశ్వర దర్శనానికి రాష్ట్రం నుండే కాక అటు మహారాష్ట్ర ఆంధ్ర నుండి వేలాదిగా భక్తులు కదలి వచ్చారు.అటవీ శాఖ పలురకాల ఆంక్షల నడుమ భక్తుల యాత్ర ఈ యేడు కేవలం మూడురోజుల దర్శనానికే పరిమితమైంది.నాగర్కర్నూల్ జిల్లాలో నల్లమల అడవుల్లో కొలువైన సలేశ్వర స్వామి ని చేరుకోవాలంటే 10 కిలోమీటర్ల మేర నడక దారిలో దట్టమైన అడవిగుండా వెళ్లాల్సిందే.ఎత్తైన కొండలను దాటుతూ అత్యంత క్లిష్టమైన ప్రయాణం చేస్తూ భక్తులు ముందుకు సాగుతుంటారు.అందమైన జలపాతాల మధ్య ఉన్న సలేశ్వరునికి భక్తులు మొక్కులు చెల్లించుకుంటున్నారు.జిల్లా పోలీస్ అటవీ శాఖతో పాటు అన్ని శాఖల అధికారులు జాతరలో భక్తులకు ఇబ్బంది జలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

## తహసీల్దార్ ఆధ్వర్యంలో జనగణన ఏర్పాట్ల పర్యవేక్షణ



**నార్సింగి, ఏప్రిల్ 2 (సిరి న్యూస్ ) :**

కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) జనాభా లెక్కలు 2027 లో భాగంగా గురువారం నార్సింగి పట్టణ కేంద్రాన్ని తహసీల్దార్ గ్రేస్ బాయి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో హౌస్ లిస్టింగ్ బ్లాక్స్ (హెచ్. ఎల్. బీ) తయారు చేయడం కోసం గ్రామాన్ని క్షేత్ర స్థాయి పరిశీలన చేశామని గ్రేస్ బాయి తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆకుల సుజాత మల్లేశ్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ మల్లేశ్ గౌడ్, ఎం.పీ.ఎస్.ఓ మల్లేశం, ఆర్ ఐ శ్రీధర్, జీపీఓ నాగరాజు, టెక్నికల్ అసిస్టెంట్, ఈఓ నాగభూషణం, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## 35 వేలకు ఇసుక వేలాన్ని దక్కించుకున్న సిద్ది రాములు



**నార్సింగి, ఏప్రిల్ 2 (సిరి న్యూస్) :**

మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం నిర్వహించిన ఇసుక బహిరంగ వేలం పాట విజయవంతంగా ముగిసింది. శేరిపల్లి ఎస్సీ కాలనీ లో స్వాధీనం చేసుకున్న ఇసుక డంప్ కు తహసీల్దార్ గ్రేసీ బాయి ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. మొత్తం నలుగురు పాల్గొన్న ఈ వేలంలో 18 ట్రిప్పుల ట్రాక్టర్ ఇసుకకు గట్టి పోటీ నెలకొంది. చివరికి శేరిపల్లి గ్రామానికి చెందిన ఇండ్ల సిద్దిరాములు రూ.35 వేలకు వేలాన్ని దక్కించుకున్నారు. వేలం పాట అనంతరం తహసీల్దార్ గ్రేస్ బాయి మాట్లాడుతూ, ఇసుక తరలింపులో పారదర్శకత పాటించాలని అన్నారు. ప్రతి ట్రిప్పు కు సంబంధించిన ట్రాక్టర్ నంబరు ను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, ఉదయం నుంచి సాయంత్రం 5 గం లోపు మాత్రమే ఇసుక రవాణా చేయాలని, నిర్దేశించిన సమయం లోపల ఇసుకను తరలించు కోవాలని స్పష్టం చేశారు. వేలం జరిగినప్పటి నుంచి ఇసుక డంప్ పూర్తి బాధ్యత కొనుగోలుదారుదే అని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారెంటీలు అమలుకు గ్రామసభలు

**! పీఏసీఎస్ మాజీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి**



**కొండాపూర్, సిరి న్యూస్:**

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 6 గ్యారంటీలు అమలుపై గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందని పీఏసీఎస్ మాజీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. గురువారం గొల్లపల్లిలో కాంగ్రెస్ చేపడుతున్న ప్రజా పాలన– గ్రామ అభివృద్ధి ప్రణాళిక పై గ్రామసభ సర్పంచ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ మాజీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలు, నిరుపేదల, సంక్షేమం కోసం అనేక పథకాలను సీఎం రేవంత్ రెడ్డి ప్రవేశ ప్రవేశపెట్టిన సంగతి గుర్తు చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్,రూ. 500 గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇండ్లు, 10 లక్షల ఆరోగ్య బీమా తదితర పథకాలపై గ్రామస్థులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమా, అభివృద్ధిపై పూర్తిగా వివరించారు. గ్రామ సభలో వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పెనిమిటి పదవి పెత్తనం భర్త

**కొండాపూర్ సిరీ న్యూస్:**

మండల కేంద్రమైన కొండాపూర్ గ్రామపంచాయతీలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా పాలన, గ్రామ ప్రణాళిక అభివృద్ధిపై గురువారం గ్రామ సభ నిర్వహించారు. కానీ సర్పంచ్ అధ్యక్షతన జరపాల్సిన గ్రామసభను భర్త నిర్వహించడంపై గ్రామస్తులు అస్సానం వ్యక్తం చేశారు. పదవీ పెనిమిటిది.. పెత్తనం భర్తది అన్న ప్రశ్న చర్చనీయాంశంగా మారింది. గ్రామంలో నెలకొన్న పంచాయతి సమస్యలతో సహా భర్తనే ముందుండి తనకు మించిన వారు లేరని పెత్తనాన్ని చలయించడంపై గ్రామ సభకు హాజరైన ప్రజా ప్రతినిధులు, వార్డు సభ్యులు, గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. గ్రామ అభివృద్ధి ప్రణాళికలు చర్చించే సమయంలో సంబంధిత అధికారులు భర్త పెత్తనం చెలాయిస్తున్న నోరు మెదపడంపై చర్చనీయాంశంగా గ్రామ సభను ముగించారు.

## అధిక పన్నుల వసూలు, ఇందిరమ్మ ఇళ్లు, పలు సమస్యల పై గరం గరంగా జరిగిన గ్రామ సభ

**నార్సింగి, ఏప్రిల్ 2 (సిరి న్యూస్) :**



రాష్ట్ర ప్రభుత్వం గ్రామ స్థాయిలో పాలన పారదర్శకంగా ఉండాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాల పై ప్రజలలో అవగాహన కల్పించాలని నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నార్సింగి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ ఆకుల సుజాత మల్లేశ్ గౌడ్ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అధికారి, జిల్లా యువజన క్రీడా అధికారి రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సభ ప్రారంభంలో రాష్ట్ర గీతాన్ని ఆలపించిన అనంతరం గ్రామ పంచాయతీ ఈఓ నాగభూషణం ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు తమ శాఖల ఆధ్వర్యంలో ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలు, అమలు తీరు గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రత్యేక అధికారి రమేష్ మాట్లాడుతూ నూతన పథకాలైన ముఖ్యమంత్రి అల్పాహార పథకం, ఇందిరమ్మ జీవిత కుటుంబ బీమా, మధ్యాహ్న భోజన పథకం ఇంటర్మీడియట్ కు విస్తరణ, దివ్యంగులైన ఇంటర్ విద్యార్థులకు స్కూటీలు, పంటల వైవిధ్యం, సహజ సేంద్రీయ వ్యవసాయం పథకాల గురించి వివరించారు. అనంతరం బీజేపీ మండల అధ్యక్షుడు శిర్న చంద్రశేఖర్, పట్టణ అధ్యక్షుడు నరసింహులు, కిసాన్ మోర్చా జిలా ఉపాధ్యక్షుడు లింగా రెడ్డి లు గ్రామ పంచాయతీ సిబ్బంది వసూలు చేస్తున్న పన్నులు ఆన్లైన్ లో ఒక రకంగా బిల్లులో మరో రకంగా రాసి అధికంగా వసూలు చేయడం పై నిలదీశారు. ఈ సందర్భంగా బాధితులు సభలో రాద్దాంతం చేశారు. అందుకు ఈఓ నాగభూషణం ఆన్లైన్ లో ఒకలా గ్రౌండ్ లెవెల్ లో మరోలా ఉండడం లో తమ సిబ్బంది తప్పేమీ లేదని, ఈ సమస్య ఒక్క నార్సింగి లోనే కాక అన్ని గ్రామాలలో ఉందని, ఇది కలెక్టర్ దృష్టికి కూడా తాము తీసుకుని వెళ్ళామని తెలిపారు. మంజూరు అయిన ఇందిరమ్మ ఇళ్లు అత్యధికంగా అనర్హులకే ఇచ్చారని, అర్హులకు అన్యాయం జరిగిందని ప్రశ్నిస్తూ లబ్ధిదారుల పేర్లు సభ లో బహిర్గతం చేయాలని పట్టుబట్టారు. అందుకు ఈఓ నాగభూషణం పేర్లు చదవగా మంజూరు అయిన కొందరు అనర్హులు ఉన్నారని అభ్యంతరాన్ని వ్యక్తం చేయగా మరోసారి పరిశీలిస్తామని సముదాయించారు. మొత్తం మీద గ్రామ సభ గందరగోళంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ యెన్నం రాజేందర్ రెడ్డి, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యుడు రాజేష్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. నార్సింగి తహసీల్దార్ గ్రేస్ బాయి మండల పరిధిలోని జప్తి శివునూరు లో జరిగిన సభలో పాల్గొన్నారు.

## లక్షా ఇరవై ఐదు వేల ఎల్.ఓ.సీ అందజేసిన కాంగ్రెస్ నాయకులు

**నార్సింగి, ఏప్రిల్ 2 (సిరి న్యూస్) :**



మండలం లోని శేరిపల్లి గ్రామానికి చెందిన రాచపల్లి లక్ష్మణ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల కార్పోరేట్ వైద్యం పొందలేక పేదరికంతో దీనావస్థలో అనారోగ్యం తో అవస్థ పడుతున్న లక్ష్మణ్ పరిస్థితిని గ్రామ మండల స్థాయి కాంగ్రెస్ నాయకులు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే రోహిత్ రావు బాధితుడు లక్ష్మణ్ కు మెరుగైన చికిత్స పొందడానికి ముందస్తుగా 1.25 లక్షల ఎల్.ఓ.సీ చెక్కు ను ప్రభుత్వం ద్వారా మంజూరు చేయగా, గురువారం ఉదయం నార్సింగి మండల కాంగ్రెస్ నాయకులు బాధితుడు లక్ష్మణ్ కు చెక్కు ను అందజేశారు. ఈ సందర్భంగా నార్సింగి మండల కాంగ్రెస్ యూత్ నాయకులు రాయిని భాను ప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్రంలో ప్రజాపాలన పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీ లను తూచ తప్పకుండా అమలు చేస్తోందని, ఇటీవల అసెంబ్లీ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ప్రవేశ పెట్టిన బడ్జెట్ సామాన్యులకు లబ్ధి చేకూరే విధంగా ఉందని అన్నారు. చికిత్స పొందడానికి ఆర్థిక సహాయం అందించిన ఎమ్మెల్యే కు సహకరించిన నాయకులకు లక్ష్మణ్ కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మండల కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు తాళ్ల స్వప్న, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు గోవర్ధన్, యూత్ కాంగ్రెస్ నాయకుడు మోతీలాల్, వార్డు సభ్యులు లక్ష్మి, నవనీత, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు శ్రీరామ్ భరత్, నాయకులు చిన్నికృష్ణ గౌడ్, పోతన శ్రీనివాస్, కందరి బాబు, జయ రాములు గౌడ్, రాచపల్లి మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ మహా చండీ సాహిత శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం

- **పాల్గొన్న మంత్రి వివేక్ వెంకటస్వామి, కాట శ్రీనివాస్ దంపతులు**

**రామచంద్రపురం, ఏప్రిల్ 2 (సిరి న్యూస్):**



తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు మరియు భూగర్భ శాస్త్ర శాఖ మంత్రివర్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి పటాన్చెరు మండలం నందిగామ గ్రామంలో నిర్వహించిన శ్రీ మహా చండీ సాహిత శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో పటాన్చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ మరియు సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులకు ఆధ్యాత్మిక ప్రశాంతతను కలిగించడంతో పాటు సమాజంలో మానవతా విలువలు, ఐక్యతను పెంపొందించేందుకు దోహదపడతాయని తెలిపారు. దేవాలయాల అభివృద్ధి, భక్తుల సేవకు అవసరమైన సహాయ సహకారాలను అందించేందుకు తమ పూర్తి మద్దతు ఉంటుందని పేర్కొన్నారు.గ్రామ సర్పంచ్ ఎల్లగోని విక్రమ్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మహోత్సవం వైభవంగా జరిగింది. వేద మంత్రోచ్చారణల మధ్య స్వామివారి కళ్యాణ మహోత్సవం నిర్వహించగా భక్తులు భక్తి భావంతో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువత, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

## ప్రజాపాలనలో వేగం పెంచే 99 రోజుల కార్యచరణ



- **ప్రగతి ప్రణాళికలో భాగంగా వార్డు సభల నిర్వహణ**
- **సంక్షేమ పథకాలు, కొత్త స్కీంలపై చర్చ**

**జిన్నారం మార్చి 2 సిరి న్యూస్**

ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం గడ్డపోతారం పురపాలక సంఘం పరిధిలోని 18 వార్డుల్లో వార్డు సభలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, వార్డ్ కౌన్సిలర్ల అధ్యక్షతన, వార్డ్ అధికారుల సమక్షంలో ఆయా వార్డు కార్యాలయాల్లో సమావేశాలు నిర్వహించారు. ఖాజీపల్లి వార్డులో జరిగిన సభలో మున్సిపల్ చైర్మన్ గద్దె సుష్మ అధ్యక్షతన, కమిషనర్ వెంకటరామయ్య ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సభకు మున్సిపల్ ప్రత్యేక అధికారి జె. శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సభను తెలంగాణ రాష్ట్ర గీతంతో ప్రారంభించి, అనంతరం ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి సందేశాన్ని చదివి వినిపించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, కొత్త పథకాలపై చర్చించి, లబ్ధిదారుల వివరాలను సభలో ప్రకటించారు. వార్డు పరిధిలోని సమస్యలు, వినతులపై చర్చించి పరిష్కారానికి సంబంధించిన తీర్మానాలు చేసి మినిట్స్ రిజిస్టర్లో నమోదు చేశారు. ప్రజలకు ప్రొజెక్టర్ ద్వారా పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి విజయ్ కుమార్, విద్యుత్, హౌసింగ్, వైద్య సిబ్బంది, వార్డ్ అధికారులు, మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, నవీన్, భవాని, అనుపమ, తరుణ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## చిరస్మరణీయులు పాపన్నగౌడ్.!

- **సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలు యువతకు ఆదర్శం**
- **అదనపు కలెక్టర్ నగేష్**

**మెదక్ ఏప్రిల్ 02,(సిరిన్యూస్)**

సామాజిక సమానత్వం,న్యాయంకోసం పోరాడిన వీర యోధుడు బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్, ఆయన జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు.గురువారం జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.అనంతరం మాట్లాడుతూ సమాజంలో అణచివేతకు వ్యతిరేకంగా పాపన్న గౌడ్ చేసిన పోరాటం చిరస్మరణీయమని గోల్కొండ కోటను జయించిన బహుజన చక్రవర్తి అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు మంగా రమేష్ గౌడ్, రేణుక ఎల్లమ్మ ఆలయం అభివృద్ధి కమిటీ చైర్మన్ విధ్యాధర్ గౌడ్, సంఘ నాయకులు నర్సింహులు గౌడ్, సురేందర్ గౌడ్, నాగరాజు గౌడ్, యాదగిరి గౌడ్, శంకర్ గౌడ్, కుమార్ గౌడ్,వెనుక బడిన తరగతుల అభివృద్ధి అధికారి గంగా కిషన్, కార్యాలయ సిబ్బంది శ్రీనివాస్,లవన్, భాను ప్రకాష్,ఆరీఫ్, నర్సింహులు,సిద్దరాములు, తదితరులు పాల్గొన్నారు.



# జోగిపేట లో బాణ సంచాల వెలుగులు

- అర్ధరాత్రి 1 గంటల వరకు లంకా దహనం
- జోగిపేటలో 50 ఫీట్ల రావణుడి ప్రతిమ
- వేలాది మందితో క్రిక్కిరిసిన ఎన్టీఆర్ స్టేడియం
- ఆకట్టుకున్న రామలక్ష్మణ హనుమంతుడి వేషధారణ...



**ఆందోలు, మార్చి 02, (సిరి న్యూస్):**

జోగిపేట జోగినాథ స్వామి జాత ర ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి ఘనంగా లంకా దహనం కార్యక్రమాన్ని నిర్వహించారు. జోగిపేటలోని ఎన్టీఆర్ మైదానంలో రావణుడి ప్రతిమ వద్ద పూజలు చేసి కార్యక్ర మాన్ని బుధవారం రాత్రి 11 గంటలకు ప్రారంభించగా, అర్ధరాత్రి 1గంటల వరకు కొనసాగించారు. బాణాసంచాల పేలుళ్లతో పట్టమంతా మార్మోగింది. సర్పాలు, పూల చెట్ల ఆకృతితో రూపొందించిన బాణా సంచాలు అందరిని ఆకట్టుకున్నాయి. జాతర ఉత్సవాల సందర్భంగా విద్యార్థినీల నృత్యప్రదర్శన కొసం మైదానంలో ప్రత్యేకంగా స్టేజీని ఏర్పాటు చేశారు. పట్టణానికి చెందిన నక్షత్ర డ్యాన్స్ ఆకాడమీకి చెందిన విద్యార్థినీలు చేసిన భరతనాట్యం, కూచిపూడితో పాటు భక్తిపాటలకు చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. నృత్య ప్రదర్శన చేసిన చిన్నారులకు ఆలయ కమిటీ సభ్యులు, మున్సిపల్ చైర్మన్ ఎస్.కృష్ణారెడ్డి జ్ఞాపికలను అందజేసి ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామ కుల పెద్దలతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

**ఆకట్టుకున్న శ్రీరాముడు, లక్ష్మణుడు, హన్మంతుడి వేషదారణ**

లంకా దహనం కార్యక్రమంలో భాగంగా పట్టణానికి చెందిన ముగ్గురు యువకులు శ్రీరాముడు, లక్ష్మణుడు, హన్మంతుడి వేషధారణలతో ట్రాక్టర్‌పై ఊరేగింపుగా వచ్చి క్రీడామైదానంలో ప్రజలకు అభివాదం చేస్తూ ఆకట్టుకున్నారు. వారిని తమ ఫోన్‌లల్లో బంధించేందుకు ఎగబడ్డారు. వారిని నిర్వాహకులు వారిని అభినందించి వారికి జ్ఞాపికలను అందజేసారు. సుమారుగా 3 గంటల పాటు జరిగిన లంకా దహనం కార్యక్రమంలో పాలుపంచుకున్నారు.

**50 ఫీట్ల ఎత్తు ఉన్న రావణుడి ప్రతిమ దహనం**

లంకాదాహనం కార్యక్రమంలో భాగంగా 50 ఫీట్ల భారీ ఎత్తుతో రూపొందిన దశ కంఠుని రావణుడి ప్రతిమను ఏర్పాటు చేశారు. రావణుడి ప్రతిమను దహనం చేసేందుకు ఎలక్ట్రిక్ విధానంతో ఒక్కొక్క తల పెలే విధంగా బాంబులను ఏర్పాటు చేశారు. రావణుడి వద్ద పూజరులు భద్రప్ప, సిద్దేశ్వర్, సుజిత్‌లు మంత్రోచ్చరణ చేయగా, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్‌లతో పాటు నాయకులు పూజలు చేశారు. రావణుడి ఒక్కోక్క తలను ఎలక్రిక్ట్ విధానంతో పెల్చేశారు. రావణుడి పది తలలను పెల్చేసి, ప్రతిమను పూర్తిగా దహనం చేశారు.మార్చి23వ తేదీన ప్రారంభమైన శ్రీ జోగినాథుడి జాతర ఉత్సవాలు గురువారం అలయంలో భక్తిశ్రద్దలతో నిర్వహించిన శివుడికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన కార్యక్రమాలతో ఉత్సవాలతో ముగిశాయి.

1 ః జోగిపేటలో ఏర్పాటు చేసిన 50 అడుగుల రావణుడి ప్రతిమ

2ః రావణుడి ప్రతమన దహనం చేసిన దృశ్యం

3. జోగిపేటలో లంకా దహనం కార్యక్రమంలో ఏర్పాటు చేసిన పాము ఆకృతి బాణా సంచాలు

4, జోగిపేటలో లంకా దహనం కార్యక్రమానికి హాజరైన ప్రజలు


5, జోగిపేటలో ఆకట్టుకున్న శ్రీరాముడు, లక్ష్మణుడు, హన్మంతుడి వేషధారణ



# రామాయంపేటలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కు ఎమ్మెల్యే నివాళులు

**రామాయంపేట, ఏప్రిల్ 2(సిరి న్యూస్)**

అణగారిన వర్గాల ఆత్మగౌరవ పోరాటాలకు నిరంతర ప్రేరణగా నిలిచిన, తెలంగాణ గడ్డపై తొలి బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు కొనియాడారు.సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతిని పురస్కరించుకొని రామాయంపేట పట్టణంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి గురువారం నాడు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ తొలి బహుజన చక్రవర్తిగా, అణగారిన వర్గాల ఆత్మగౌరవ పోరాటాలకు నిరంతర స్ఫూర్తిగా నిలిచిన మహోన్నత వ్యక్తిగా గుర్తు చేసుకున్నారు.మహనీయుల చరిత్రను భావితరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహిస్తున్నదని ఎమ్మెల్యే ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు కుల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ప్యారక్వాట్ ఇక తెలంగాణాలో నిషేధం !

- జీవో విడుదల చేసిన తెలంగాణ ప్రభుత్వం

**హైదరాబాద్,ఏప్రిల్ 2:(సిరి న్యూస్ ) :**

కలుపు నివారణ కోసం రైతులు వాడుతున్న అత్యంత ప్రమాదకరమైన గడ్డి మందు ప్యారక్వాట్ ను ఆరు నెలల పాటు నిషేధిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.రైతుల ఆరోగ్యానికి హానికరంగా మారిన ప్యారక్వాట్ వాడకంపై అటు కేంద్రం సైతం నిషేధం విధించింది.పంటలో కలుపు నివారణ కోసం రైతులు అత్యధికంగా అదే మందును వినియోగిస్తుంటారు.ఆ కలుపు మందు మూలంగా ప్రజల ప్రాణానికి ముప్పు




వాటిల్లడంతో పాటు భూమి సారం దెబ్బతింటుందని ఒక అధ్యయనంలో తేలింది.ఆ మందు అమ్మకం జరిపితే కఠిన చర్యలు ఉంటాయని వ్యవసాయ శాఖ అధికారులు హెచ్చరించారు

# కల్తీ కల్లు తాగి మరణిస్తున్నా పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు

- ఇప్పటివరకు 20 మంది మృత్యు వాత.
- గ్రామసభలో అధికారుల ముందు
- పర్వతాపూర్ సర్పంచ్ తార్య నాయక్ ఆవేదన...

**రామాయంపేట, ఏప్రిల్ 2(సిరి న్యూస్**



రామాయంపేట మండలంలో కల్తీకల్లు సేవించి ఎంతోమంది చనిపోతున్నారని, మరి ఎంతో మంది మీద కేసులు నమోదు అయ్యాయని, ఉన్నతాధికారులు వెంటనే కల్తీ కల్లును అరికట్టాలని రామాయంపేట మండలం పర్వతాపూర్ గ్రామ సర్పంచ్ తార్య నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. రామాయంపేట మండల పరిధిలోని పర్వతాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ తార్య నాయక్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాయంపేట మండలం లోని లక్ష్మాపూర్ గ్రామంలో పెద్ద ఎత్తున కల్తీకల్లు అమ్మకాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. దాదాపుగా రామాయంపేట మండలంలో ఒక్క లక్ష్మాపూర్ గ్రామంలో పెద్ద ఎత్తున కల్తీకల్లు విక్రయాలు జరుగుతున్న పట్టించుకోవాల్సిన ఎక్సైజ్ అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని గ్రామసభలో ఆయన అధికారుల ముందు వాపోయారు.. వెంటనే కల్తీ కల్లు ను బందు చేయకపోతే మరి ఎంతో మంది ప్రాణాలు కోల్పోతారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, భవిష్యత్తు ప్రణాళికల గురించి గ్రామస్తులతో చర్చించారు. గ్రామంలో కల్తీ కల్లు వినియోగం పెరిగిపోవడం వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో ఇప్పటివరకు కల్తీ కల్లు కారణంగా సుమారు 20 మంది మరణించారని, 38కి పైగా కేసులు నమోదయ్యాయని తెలిపారు. దీనిపై ఎక్సైజ్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ఆశించిన స్పందన లేదని, అధికారులు స్పందించి కల్తీ కల్లు అమ్మకాలను అరికట్టాలని కోరారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కొనసాగుతోందని, ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు సహకారంతో కొత్త రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. అలాగే అంగన్‌వాడీ భవన నిర్మాణం, సిసి రోడ్ల ఏర్పాటు పనులు త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో ప్రతి ఒక్కరికీ స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఫిల్టర్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుపై గ్రామసభలో తీర్మానం చేసినట్లు ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల ఆర్డబ్ల్యూఎస్ ఏ ఇ కిరణ్ కుమార్, గ్రామ కార్యదర్శి లక్ష్మి, పంచాయతీ వార్డు సభ్యులు, ఇతర శాఖల అధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు. ఇలా ఉండగా సర్పంచ్ తార్య నాయక్ సొంత డబ్బులతో వికలాంగులకు మూడు చక్రాల సైకిల్లను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన చాకలి లచ్చయ్య అనే వికలాంగునికి, మరొక వ్యక్తికి సుమారు 25 వేల రూపాయల వ్యయంతో రెండు సైకిళ్లను అందజేయడం జరిగింది. గతంలో ఒక సైకిల్ ఇవ్వగా, తాజాగా గురువారం నాడు గ్రామసభలో ఇంకొక సైకిల్ పంపిణీ చేశారు.. ఈ సందర్భంగా గ్రామస్తులు సర్పంచ్ ఔదార్యాన్ని కొనియాడారు.

# రాయిలాపూర్ లో కన్నుల పండుగగా రాముల వారి కళ్యాణం

- ఘనంగా రథోత్సవం.

**రామాయంపేట, ఏప్రిల్ 2(సిరి న్యూస్ )**

రామాయంపేట మండలం రాయిలాపూర్ లో రథోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని శ్రీ రామరామచంద్ర స్వామి దేవాలయంలో గత 28 స్వామి వారి కల్యాణోత్సవం కన్నుల పండుగగా జరిగింది. కల్యాణంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు కాగా నాటి నుంచి వారం పాటు నిత్యం వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం సాయంత్రం గరుడ శా వ ను గ్రామంలో ఊరేగించారు.గురువారం ఉదయం రథాన్ని సుందరంగా అలంకరించి,స్వామివారిని గ్రామంలో ఊరేగించారు.ఇందులో గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని రథాన్ని లాగగా,మహిళలు స్వామి వారికి మంగళ హారతులు ఇచ్చి కొబ్బరి కాయలు కొట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ తో పాటు గ్రామ పెద్దలు,ప్రజలు పాల్గొన్నారు.


రాయలపూర్ గ్రామంలో సీతారాముల రథోత్సవం

# పాఠశాలల్లో ఘనంగా వార్డు సభలు..






**రామాయంపేట, ఏప్రిల్ 2 (సిరి న్యూస్)**

రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం వార్డు సభలు నిర్వహించారు.ప్రజలకు ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు ప్రజాపాలన ప్రగతి కార్యక్రమం (99 రోజుల కార్యాచరణ ప్రణాళిక)లో భాగంగా రామాయంపేట మున్సిపాలిటీలో ఉన్న 12 వార్డుల సభలు నిర్వహించగా, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు వివిధ సంక్షేమ పథకాల గురించి వివరించడంతో పాటు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా విని నమోదు చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. సభలో ముఖ్యంగా పింఛన్లు, రేషన్ కార్డులు, గ్యాస్ సబ్సిడీలు, ఇళ్ల నిర్మాణం, విద్యా మరియు ఆరోగ్య సేవలపై వివరాలు అందించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు చేరేలా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. గ్రామ సభలో ప్రజల సమస్యలను నమోదు చేసుకున్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చే వేదికగా ఈ వార్డు సభ లు నిలిచాయి. ప్రధానంగా తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ సమస్యలపై ప్రజలు తమ అభ్యర్థనలు తెలి యజేశారు. అధికారులు వాటిని పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుం టామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం పూర్తిగా అధికారుల సమక్షంలో నే జరిగింది. 12 వార్డుల్లో జరిగిన వార్డు సభల్లో సంబంధిత మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఒకటో వార్డులో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గజవాడ లావణ్య నాగరాజు గుప్తా పాల్గొన్నారు. అలాగే ఐదో వార్డులో కౌన్సిలర్ చౌదరి చరిత ఆధ్వర్యంలో నిర్వహించిన వార్డు సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలించారు. ఇంకా పలు వార్డులో ఆయా కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే విద్యాశాఖ, పంచాయతీ రాజ్, ఆరోగ్య శాఖ, రెవెన్యూ, పశుసంవర్ధక శాఖ, ఇంజినీరింగ్ విభాగాలకు చెందిన అధికారులు హాజరై ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచడంలో గ్రామ సభలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అధికారులు పేర్కొన్నారు. ఇటువంటి కార్యక్రమాలు తరచుగా నిర్వహించి ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**ఆర్ వెంకటాపూర్లో విజయవంతమైన గ్రామసభ..**

రామాయంపేట మండలం వెంకటాపూర్ ఆర్.గ్రామంలో గ్రామ సభ విజయవంతమైంది. గ్రామ సర్పంచ్ వెంకు గారి ఉమా సంజీవరెడ్డి అధ్యక్షుత న జరిగిన సమావేశంలో ప్రజలు తమకు ఉన్న సమస్యలను చెప్పుకున్నారు. పార్టీలకతీతంగా గ్రామాన్ని అభివృద్ధి పరుచుకుందామని తెలిపారు.

# ఘనంగా హనుమాన్ జయంతి ఉత్సవాలు

- సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు
- హనుమాన్ మాల విరమణ

**తూప్రాన్ ఏప్రిల్ 2 సిరి న్యూస్**

తూప్రాన్ పెద్ద చెరువు కట్టపై వెలసిన శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో గురువారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి హనుమాన్ జయంతి పురస్కరించుకొని మాలాధారణ చేసిన 250 మంది హనుమాన్ మాలధారణ స్వాములతో పాటు వందలాది మంది భక్తులు వ్రత పూజల్లో పాల్గొన్నారు గత 40 సంవత్సరాలుగా తూప్రాన్ శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయం లో హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నాట్లు ఆత్రేయ శర్మ తెలిపారు తెలంగాణ లోనే మరో కొండా గట్టు ఆంజనేయ స్వామి ఆలయం గా ప్రసిద్ధిగాంచిన ఆలయం లో మాలధారణ వేసుకున్నా ఈ ఆలయంలో జయంతి రోజు ఇక్కడే మాల విరమణ సలక ఆత్రేయ శర్మ ఆధ్వర్యంలో జరుగుతుంది ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు భక్తి శ్రద్ధల తో ఉండాలని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సనాతన ధర్మాన్ని కాపాడాలని దర్మం న్యాయం వైపు నడవాలని ఆయన కోరారు తూప్రాన్ ఆంజనేయస్వామి ఆలయం చాలా మహిమ గల ఆలయం ఇక్కడ నమ్మకం తో కొలుస్తే కోరికలు తీర్చే హన్మంతుడు వివాహాలు వ్యాపార అభివృద్ధి ఉద్యోగం సంతానం లాంటి కోరికలు తీర్చే కొలువైన దేవుడు వీరాంజనేయుడు అని ఆయన తెలిపారు స్వామి వారికి చందన అభిషేకం లక్ష ఆకుపూజ లక్ష పుష్పర్చన సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు అనంతరం మహా అన్నధానం ఏర్పాట్లు చేశారు భక్తులు అధిక సంఖ్య లో పాల్గొన్న భక్తులకు ప్రముఖులకు ఆత్రేయ శర్మ ఆంజనేయ స్వామి ఆశీస్సులు ఉంటాయని అన్నారు.



# చెరువులో గుర్తు తెలియని మగ వ్యక్తి శవం లభ్యం.



కొంపల్లి,ఏప్రిల్ 02 (సిరి న్యూస్).

పేట్-బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మైసమ్మ గూడా సెయింట్ పీటర్స్ కళాశాల వెనుకాల చెరువులో మగ వ్యక్తి శవం బయట పడింది.స్థానికుల సమాచారం తో అక్కడికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు 2 నుండి 3 రోజుల క్రితం మరణించాడని మృతుడి వంటిపై పింక్ కలర్ ఫుల్ షర్ట్ మరియు బ్లాక్ కలర్ పాంట్ ,దానికి ఫ్రైడ్ ఇండియా అనే సెక్యూరిటీ సర్వీస్ కి సంబంధించిన బెల్ట్ ఉందని మృతుడి వయస్సు సుమారు 35 నుండి 40 సవంత్సరాలు ఉంటుందని అన్నారు.ఎవరికైనా మృతుడి వివరాలు తెలిస్తే స్థానిక పోలీస్ వారికీ సమాచారం ఇవ్వాలని వారు తెలిపారు.

# ఘనంగా శివంపేటలో కోదండ రామస్వామి రథోత్సవ వేడుక!!



శివంపేట ఏప్రిల్ 2 (సిరి న్యూస్ )

శివంపేట మండల కేంద్రంలోని ప్రసిద్ధి పురాతన దేవాలయమైన శ్రీ కోదండరామస్వామి దేవాలయంలో మార్చ్ 27వ తేదీన కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. అనంతరం వారం రోజులపాటు వివిధ అవతార రూపంలో భక్తిశ్రద్ధలతో పల్లకి సేవలు జరిగాయి. అందులో భాగంగా చివరి రోజు అయిన గురువారం రోజున ఘనంగా కోదండ రామస్వామి రథోత్సవం అంగరంగ వైభవంగా వేద పండితులైన శాస్త్రుల వామన శర్మ, శాస్త్రుల రాఘవేంద్ర శర్మ మరియు శ్రీ కోదండరామ స్వామి పురోహితులు చందు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపించి రథోత్సవ కార్యక్రమం ప్రారంభించారు. రథోత్సవం ప్రధాన వీధుల గుండా కొనసాగింది. మహిళా మణులు కోదండరామ స్వామికి మంగళ హారతులతో స్వాగతం పలికారు. కోదండ రామస్వామి భక్తులు రథోత్సవం ముందర కోదండ రామస్వామి గోవిందా గోవిందా అంటూ భక్తులు నినాదాలతో బయలుదేరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రాజి పేట వెంకటేశ్వర్, ఉప సర్పంచ్ ఇసు గారి మల్లేశం, మాజీ ఉపసర్పంచ్ బాసంపల్లి రామా గౌడ్, గ్రామ తెరాస అధ్యక్షులు ముద్దాగళ్ల లక్ష్మీనరసయ్య, మరియు గ్రామ పంచాయతీ పాలకవర్గం సభ్యులు, కోదండ రామస్వామి భక్తులు గ్రామ ప్రజలు రథోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అక్రమణులపై హైడ్రా యాక్షన్ పార్క్ స్థలం స్వాధీనం




- **పార్క్ స్థలం తిరిగి ప్రజలకు హైడ్రా చర్యలు**
- **ప్రభుత్వ భూములపై అక్రమాలకు ఫుల్ స్టాప్ హైడ్రా**
- **5797 స్క్వేర్ యార్డ్స్ భూమి చుట్టూ ఫెన్సింగ్**
- **47 కోట్ల విలువగల భూమి కాపాడిన ఐడ్రా**

అమీన్ పూర్ మార్చి 2 సిరి న్యూస్

అమీన్ పూర్ జిహెచ్ఎంసి సర్కిల్ పరిధిలోని చక్రపురి కాలనీ సర్వే నంబర్ 152 ,153 15 ఎకరాల మేర 144 ప్లాట్లతో శ్రీ వెంకటరమణ కాలనీ పేరిట లేఔట్ వేశారు. మనోజ్ ప్రైవేట్ ట్రస్ట్ కు మేనేజింగ్ ట్రస్ట్ గా ఉన్న పవర్ లాల్ ఈ లేఔట్ వేయగా, తర్వాత 2012లో ఆ బాధ్యతలు చేపట్టిన మహా కుమార్ జైన్ ఇందులో ఏడెకరాలను వ్యవసాయ భూమిగా పేర్కొంటూ అమ్మేశారు. 15 ఎకరాలలో వేసిన లేఔ కు కూడా అనుమతి ఉంది. అయినా ఇందులో ఏడెకరాలను వ్యవసాయ భూమిగా అమ్మేశారని వెంకటరమణ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. 7 ఎకరాలకు సంబంధించిన వివాదం కోర్టులో ఉంది. ఇదే అదునుగా మిగిలిన ఎనిమిది ఎకరాల లే అవుట్ లోని 4960 గజాలతో ఓ పార్కు, 837 గజాలతో మరోపార్కు కబ్జా చేసే ప్రయత్నాలు చేయగా, సొసైటీ సభ్యుల ఫిర్యాదు మేరకు హైడ్రాకు వినతిపత్రం సమర్పించారు. తక్షణమే ఐడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో సమంత శాఖలతో హైడ్రా అధికారులు పరిశీలించారు. పార్కు స్థలాలుగా పేర్కొంటూ హైడ్రా అధికారుల బృందం గురువారం 5797 గజాల రెండు పార్కులను ఫెన్సింగ్ వేసి కాపాడారు. పార్కు స్థలాలను కబ్జాలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హైడ్రా అధికారులు హెచ్చరింపు చేశారు. ప్రైమ్ ఏరియాలో ఉన్న భూమి కావడంతో 47 కోట్ల పైచిలుకు ఉంటుందని అంచనా వ్యక్తం చేశారు.

# భూమి కావాలా? ఫ్యాక్టరీలు కావాలా?

- **రాష్ట్రంలోని డ్వాక్రా మహిళలందరికి ఉచిత పరీక్షలు**
- **నియోజకవర్గానికి ఫార్మసీ కళాశాల మంజూరు**
- **సంగుపేట వద్ద రెండు ఫ్యాక్టరీలు ఏర్పాటు చేస్తా**
- **రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సీ.దామోదర్ రాజనర్సింహ**



అందోలు, మార్చి 02, (సిరి న్యూస్);

నా తండ్రి రాజనర్సింహ హయాంలో మీ గ్రామానికి వంద ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని కెటాయించాడని, ఆ భూమిలో ఫ్యాక్టరీలు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నట్లు తెలిసిందని మీకు భూమి కావాలా? లేక ఫ్యాక్టరీలు కావాలా అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి సి.దామోదర రాజనర్సింహ ప్రశ్నించారు. ◌ురువారం ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అందోలు మండలం అల్మాయిపేటలో నిర్వహించిన గ్రామసభకు ఆయన ముఖ్య అతిథిగా హజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన పై విధంగా మాట్లాడగా దీంతో గ్రామంలోని యువకులు కొందరు తమకు ఉపాధి అవకాశాలు కావాలని కోరారు. ఇందుకు మంత్రి సమాధానం ఇస్తూ ప్రస్తుతం ఆ భూమి చాలా విలువైనదని, భూమి పోతే మళ్లీ దొరకదని, అదే స్థలంలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని, అందుకు తాను పూర్తిగా సహకరిస్తానని సూచించారు. సంగుపేట దగ్గరలోని భూమిలో రెండు ఫ్యాక్టరీలను ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు. «కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు. మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, సన్నబియ్యం, రేషన్‌కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు వంటి అనేక సంక్షేమాలను అందిస్తుందన్నారు. సబ్సిడి గ్యాస్ డబ్బుల విషయంలో అందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

### నేషనల్ హైవే డిజైన్‌లో తప్పు

161 నేషనల్ హైవే రోడ్డు డిజైన్‌లో తప్పు జరిగిందని, శివ్వంపేట, తాడ్‌దాన్‌పల్లి చౌరస్తా, అల్మాయిపేట, బొడ్మట్‌పల్లి వద్ద బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాల్సి ఉందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి సి.దామోదర రాజనర్సింహ అన్నారు. ఈ రోడ్డుపై రోజుకో దగ్గర ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. ఆరు మాసాల క్రితం తాను హైవే అథారిటీ అధికారులను తీసుకొని ఈ ప్రాంతంలో అవసరమైన అండర్‌పాస్ బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాల్సిన స్థలాలను పరిశీలించినట్లు తెలిపారు.

### రాష్ట్రంలోని 46 లక్షల మందికి ఉచితంగా పరీక్షలు

మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 46 లక్షల మంది ద్వాక్రా గ్రూపు మహిళలకు 30 రకాల వైద్య పరీక్షలు నిర్వíß ◌ంచే కార్యక్రమాన్ని ప్రారంభించామని మంత్రి ప్రకటించారు. కాబట్టి మహిళలు దగ్గరలోని హెల్త్ సెంటర్‌లకు వెళ్లి అన్ని రకాల పరీక్షలు చేసుకోవాలని సూచించారు. మనకు ఉన్న అనారోగ్య సమస్యలు బయటపడితే చికిత్సల ద్వారా నయం చేసుకోవచ్చునని అన్నారు. అల్మాయిపేట గ్రామంలో 28 సంఘాలకు రూ.3.50 కోట్ల రుణాలను అందించామని, రూ.2.50 లక్షల వడ్డీ సబ్సిడీ ఇచ్చామన్నారు.

### అందోలులో ఫార్మసీ కళాశాల ఏర్పాటు

అందోలు నియోజకవర్గంలో ఇదివరకే అనేక విద్యాసంస్థలను తీసుకురావడం జరిగిందని, కొత్తగా త్వరలో ఫార్మసీ కళాశాలను సంగుపేట వద్ద ఏర్పాటు చేయబోతున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సీ.దామోదర్ రాజనర్సింహ అన్నారు. అందోలు వద్ద 150 పడకల ఆసుపత్రి నిర్మాణం జరుగుతుందని, దాని ప్రక్కనే మన ఆడ బిడ్డల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నర్సింగ్ కళాశాలను మంజూరు చేయించినట్లు తెలిపారు. ఆసుపత్రి నిర్మాణం పూర్తయిన తర్వాత మీరు సంగారెడ్డి ఆసుపత్రికి వెళ్లే అవసరం లేదన్నారు.

### అల్మాయిపేటకు మంత్రి వరాలు

అల్మాయిపేట గ్రామంలోకి వెళ్లే గ్రామ ప్రధాన రహదారిని కొన్యాల వరకు బీటీ రోడ్డుగా అభివృద్ధి చేసుకుందామని, గ్రామంలో అండర్ డ్రైనేజీ, సీసీ రోడ్లు, జాతీయ రహదారి వద్ద బ్రిడ్జి నిర్మాణం చేయిస్తానని, సర్వే నంబర్ 513లో ఇళ్లు నిర్మించుకుంటామంటే 40 ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. గ్రామానికి మంజూరైన పది ఇందిరమ్మ ఇళ్లలో ఏడుగురు మాత్రమే నిర్మించుకోగా మిగతా ముగ్గురి ఆర్థిక స్థోమత బాగా లేకపోవడంతో ఆ ముగ్గురికి మంత్రి స్వంతంగా ఆర్థికంగా ఆదుకుంటానని హమీ ఇచ్చారు. అదనపు కలెక్టర్ పాండు, సర్పంచ్ దుర్గాప్రసాద్, జిల్లా నాయకులు జగన్మోహన్‌రెడ్డి, ఎస్.సురేందర్‌గౌడ్‌తో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మహిళల చైతన్యంతోనే గ్రామాభివృద్ధి సాధ్యం

- **పంచాయతీ రాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్.**
- **ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికతో గ్రామాల్లో అభివృద్ధి : కలెక్టర్ పి. ప్రావీణ్య.**

కొండాపూర్ సిరి న్యూస్:

కొండాపూర్ మండలం తోగార్పల్లి గ్రామంలో గురువారం ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక, 99 రోజుల కార్యాచరణలో భాగంగా గ్రామ సభను అధికారులు విజయవంతం గా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్, జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య పాల్గొని మాట్లాడారు గ్రామ సభను రాష్ట్ర గీతంతో ప్రారంభించి, ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రసంగాన్ని గ్రామ ప్రజలకు వినిపించారు. ఈ సందర్భంగా అధికారులు గ్రామంలో అమలవుతున్న పలు కీలక పథకాలపై వెల్లడించారు. ఈ సందర్భంగా పంచాయతి రాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్ మాట్లాడుతూ జిల్లాలో అధిక శాతం అధికారులుగా మహిళలే ఉన్నారని, మహిళలు పనిచేస్తే సాధించలేనిది ఏదీ లేదని, గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా సీసీ రోడ్లు, శానిటేషన్ పనులు, గ్రామపంచాయతీ భవనాలు, సంఘ భవనాలు, ఉపాధి కార్డుదారులకు 100 రోజుల పని కల్పించాలని, వేసవిలో కూలీలకు తాగునీరు, నీడ, ఫస్ట్ ఎయిడ్ సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్త వేరు చేసి అందించాలని గ్రామ సభలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుకు చేరేలా కృషి చేయాలని పేర్కొన్నారు. మహిళా సాధికారత కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించి, స్వయం సహాయ సంఘాలకు రుణాలు, డిజిటల్ హెల్త్ కార్డులు, జీవనోపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. మహిళలను బస్సు, పెట్రోల్ బంక్ యజమానులుగా తీర్చిదిద్దే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు ఈ సందర్భంగా కలెక్టర్ పి. ప్రావీణ్య మాట్లాడుతూ... గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఇప్పటికే గ్రామాల్లో శానిటేషన్ డ్రైవ్ నిర్వహించామని, రాబోయే 90 రోజుల్లో శాఖల వారీగా పది ముఖ్య అంశాలపై కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. గ్రామాలలో అమలవుతున్న పథకాల లబ్ధిదారుల వివరాలను వెల్లడిస్తూ, గ్రామ సభలలో ఏర్పాటు చేసిన కౌంటర్లలో ప్రజలు తమ అర్జీలు, అభ్యంతరాలు, సూచనలు సమర్పించాలని సూచించారు. జిల్లాలో రైతు భరోసా పథకం కింద సంవత్సరానికి రూ.12,000 చొప్పున రైతులకు ఆర్థిక సహాయం అందిస్తూ 2025-26 యాసంగి సీజన్‌కు రూ.167 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద జిల్లాలో 12649 మంది లబ్ధిదారులకు ఎంపిక చేసిన 443 ఇండ్లు పూర్తి స్థాయిలో నిర్మాణం వివిధ దశల నిర్మాణం లోఉన్న ఇండ్లకు రూ.163 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు. ప్రతి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించడంతో పాటు నిరాశ్రయులకు స్థలాలు కేటాయిస్తున్నట్లు తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో డిసెంబర్ 2023 నుండి ఇప్పటివరకు దాదాపు 4.98 కోట్ల మంది మహిళలు ప్రయాణించి రూ.224.68 కోట్ల మేర ఆదా చేసుకున్నట్లు తెలిపారు. రూ.500 గ్యాస్ సిలిండర్ పథకం కింద జిల్లాలో 1,76,570 మందికి రూ.22 కోట్ల సబ్సిడీ అందించగా, గృహజ్యోతి పథకం కింద 2,17,527 లబ్ధిదారులకు రూ.165.39 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. సన్న రకం వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లిస్తూ, 2,14,785 టన్నుల కొనుగోలు చేసి రూ.10.73 కోట్ల బోనస్ రైతులకు అందించినట్లు తెలిపారు .చేయూత పథకం, సామాజిక భద్రత పెన్షన్లు, కింద 1,52,571 మందికి రూ.36.02 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. జిల్లా లో 2025-26 ఆర్థిక సంవత్సరం నకుగాను మహిళా శక్తి పథకం కింద 13,525 స్వయం సహాయ సంఘాలకు రూ.801.33 కోట్ల రుణాలు, 15,074 గ్రూపులకు వడ్డీ లేని ఋణాలు రూ.49.70 కోట్ల రూపాయలు అందించడం జరిగింది .ఇందిరమ్మ చీరల పథకం కింద 1,98,560 చీరలు పంపిణీ చేయగా, ఆహార భద్రత కింద 51,490 కొత్త రేషన్ కార్డులు జారీ చేసి, 1,56,720 మందికి లబ్ధి చేకూర్చినట్లు తెలిపారు. ప్రతి నెల 9017 మెట్రిక్ టన్నుల సబ్సిడీ బియ్యం పంపిణీ జరుగుతోందని తెలిపారు . ప్రభుతం కొత్తగా అల్పాహారం పథకం, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం,దివ్యాంగ విద్యార్థులకు మోటర్ వాహనాల పంపిణీ, మధ్యాహ్నం భోజనం పథకం ఇంటర్నెట్ వరకు విస్తరణ, పంటల సహజ సేంద్రియ వ్యవసాయం పంటల వైవిధ్య కరణ వంటి పథకాలను చేపట్టనున్నట్లు తెలిపారు . ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుకు చేరేలా అధికారులు కృషి చేయాలని, గ్రామ సభలను విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భముగా సభకు హాజరైన లబ్ధిదారులు రైతు భరోసా పథకం కింద లబ్ధి పొందిన రైతులు,సంక్షేమ పథకాల లబ్ధిదారులు తమ అభిప్రాయాలను తెలిపి సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం తోగరుపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న మహిళా భవనం పనులను పరిశీలించారు. అలాగే గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి, ఉపాధి హామీ పథకం కింద గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను కమిషనర్ దివ్య దేవరాజన్ సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ జానకి రెడ్డి, పీడీ డీఆర్‌డీఓ జ్యోతి, గ్రామ సర్పంచ్ దివ్య వాణి ప్రశాంత్ గౌడ్, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు,ఉపసర్పంచ్ , ప్రజాప్రతినిధులు,

# ప్రజా పాలన వార్డు సభలో వెల్లువెత్తిన సమస్యలు

- **రైతులకు న్యాయం చేయాలని డిమాండ్**
- **హామీలు అమలు కాలేదని ఆవేదన**

గుమ్మడిదల, ఏప్రిల్ 2( సిరి న్యూస్):

పురపాలక సంఘం కేంద్రమైన గుమ్మడిదలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం చైర్మన్ కుమార్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా గురువారం పుర పాలక సంఘం భవనంలో గ్రామసభను నిర్వహించారు. వార్డు సభ కార్యక్రమంలో గ్రామస్తులు తమ సమస్యలను బహిరంగంగా వెల్లడించారు. వివిధ ప్రభుత్వ పథకాల అమలులో ఉన్న లోపాలపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ, రేషన్ బియ్యం వంటి పథకాల విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులను సభలో ప్రస్తావించారు. అర్హులైన వారికి సరైన లబ్ధి అందడం లేదని పలువురు గ్రామస్తులు ఆరోపించారు. ముఖ్యంగా గ్రామంలోని 109 సర్వే నంబర్ భూముల సమస్యపై రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం భూములను స్వాధీనం చేసుకున్నప్పటికీ ఇప్పటివరకు తగిన పరిహారం లేదా హామీ ఇచ్చిన ప్లాట్ల కేటాయింపు జరగలేదని విమర్శించారు. వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఆ ప్రాంతంలో కొనసాగుతున్న పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి కల్పించాలని గ్రామస్తులు కోరారు. ప్రభుత్వ విధానాలు ప్రజలకు ఉపయోగపడేలా అమలు చేయాలని సభలో పలువురు సూచించారు. ఈ సందర్భంగా చైర్మన్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడం కోసం ఇలాంటి వార్డు సభలు నిర్వహించడం జరుగుతున్నాయని తెలిపారు. ప్రజలు చెప్పిన ప్రతి సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని చెప్పారు. ముఖ్యంగా భూముల సమస్య, పథకాల అమలు వంటి అంశాలపై ఉన్న లోపాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే అంశంపై కూడా ఉన్నతాధికారులతో చర్చి స్తామని తెలిపారు. కమిషనర్ దశరథ్, వైస్ చైర్మన్ సంధ్యారెడ్డి, కౌన్సిలర్లు సరెడ్డి గారి పద్మ, మాధవి, ప్రమీల, కత్తుల రమేష్, మున్సిపల్ అధికారులు, వివిధ శాఖల పాల్గొన్నారు.

Published by Badhe Jayasree on behalf of Siri Media. Published at Flat No. 104, Kapil Kausalya Apartment, Shilpa Cereny County Vencher, Near MBR Garden, Pothireddypally X Road, Sangareddy, Telangana State - 502201. Phone : 9697889922. E-Mail : siridailynews@gmail.com.